# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక


సంపుటి : 6 | సంచిక : 193 | పేజీలు : 8 | వెల : రూ.2/- శనివారం 08 ఆగస్టు 2026

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


## చట్టం చేస్తున్నాం...బీసీలకు
# సంరక్షణ కల్పిస్తాం

### - చేనేతలకు మేలు చేసేది... అండగా నిలిచేది కూటమి ప్రభుత్వమే

**● మాది బ్రాండ్ ఇమేజ్... వాళ్లది బ్యాడ్ ఇమేజ్ ● జన్-జీ అభివృద్ధి కోరుకుంటోంది... జనరేషన్ గొడ్డలి కుట్రలు పన్నుతోంది ● 12వ జాతీయ చేనేత దినోత్సవంలో సీఎం చంద్రబాబు ● చీరాలలో నేతన్న సేవలో పథకం ప్రారంభం ● కుటుంబానికి రూ.25 వేలు చొప్పున 71,536 కుటుంబాలకు రూ. 179 కోట్లు జమ చేసిన సీఎం**



**చీరాల,మన జనప్రగతి ఆగస్టు 07:** బీసీల సంరక్షణను చేపట్టే బాధ్యత కూటమి ప్రభుత్వానిదేనని... దీనికోసం త్వరలోనే చట్టం చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. బీసీ సంరక్షణ చట్టం కోసం ముసాయిదా సిద్దమైందని వెల్లడించారు. శుక్రవారం 12వ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గంలోని కొత్తపేట గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన నేతన్న సేవలో సంక్షేమ పథకాన్ని సీఎం ప్రారంభించారు. రాష్ట్రంలోని అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని సీఎం అందించారు. మొత్తంగా మిగతా2లో...



## చిన్నతరహా పరిశ్రమలకు
# పెద్దపీట

**● చేతివృత్తులు, రైతులకు మార్కెట్ అవకాశాలు ● బ్రిక్స్ మంత్రుల సమావేశంలో నిర్ణయం**

**● కేంద్రమంత్రి పీయూష్ గోయల్**

**జైపూర్,మన జనప్రగతి ఆగస్టు 07:** దేశంలోని చిన్న తరహా పరిశ్రమలు, చేతివృత్తుల కళాకారులు, రైతులు, మత్స్యకారుల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలు పెంచేందుకు వీలుగా కేంద్రం సరికొత్త చర్యలు తీసుకుంది. ఇందుకోసం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మిగతా2లో...



## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

### - కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి ఆగస్టు 07:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై మిగతా2లో...

## వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై
# మంత్రి నిమ్మల సమీక్ష

**● హాజరైన ఇరిగేషన్ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్, అడ్వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు**



2లో

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**● దీక్షా శిబిరాలపై దాడులు సరికాదు ● రాజకీయ ఉన్మాదానికి ఇది పరాకాష్ట ● బొత్స సత్యనారాయణ మండిపాటు**



2లో

## రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా
# మార్చడమే లక్ష్యం

**పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవం**

**ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



2లో

## ఎపిలో పిడుగులతో కూడిన
# వర్షాలు


### - రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి



2లో

## రాష్ట్రంలో భారీగా
# ఐఎఎస్‌ల బదిలీ

**● 22 మందిని బదిలీ చేస్తే ఉత్తర్వులు ● విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు ● రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్ ● జెఎడిలో రిపోర్ట్ చేయాలని ఆమ్రపాలికి ఆదేశం**




**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 07:**ఏపీలో పలువురు ఐఏఎస్‌లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్‌ఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె. శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఎం. శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం మిగతా2లో...



## వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోంది

### - మెగా డీఎస్సీతో 16 వేల కుటుంబాల్లో వెలుగులు నింపాం: మంత్రి నారాయణ

**నెల్లూరు,మన జనప్రగతి ఆగస్టు 07:** మెగా డీఎస్సీ ద్వారా 16 వేల మంది యువతకు ఉపాధ్యాయ ఉద్యోగాలు కల్పించిన ప్రభుత్వంపై వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ విమర్శించారు. నెల్లూరు సిటీ నియోజకవర్గ పర్యటనలో ఉన్న ఆయన వైసీపీ చేపడుతున్న నిరాహార దీక్షలపై మీడియా అడిగిన ప్రశ్నలకు మిగతా2లో...

# చట్టం చేస్తున్నాం...బీసీలకు సంరక్షణ కల్పిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

71,536 చేనేత కుటుంబాలకు రూ.179 కోట్లను సీఎం చంద్రబాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అలాగే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉన్నా... రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం-అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని ముఖ్యమంత్రి వెల్లడించారు. అలాగే రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతిని అడ్డుకునేలా జరుగుతున్న కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తతో ఉండాలని సూచించారు. ఇలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠినంగా ఉంటుందని... ప్రజలు కూడా కుట్రలు పన్నే వారి నైజాన్ని గమనించాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."స్వదేశీ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకునేలా ఆగస్ట్ 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఇది మరపురాని రోజుగా ఉండాలనే నేతన్న సేవలో... పథకాన్ని ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలే కాదు... చెప్పని వాటినీ అమలు చేస్తున్నామనడానికి నేతన్న సేవలో పథకమే నిదర్శనం. చేనేత కేవలం ఒక వృత్తే కాదు... భారతీయ సంస్కృతికి ప్రతీక. దేశం గర్వించే కళ చేనేత. మన రాష్ట్రం అనేక చేనేత కళలకు నిలయం. అలాంటి వర్గానికి ఆసరాగా ఉంటున్నాం. చీరాల, వెంకటగిరి, ధర్మవరం, ఉప్పాడ, మంగళగిరి, పొందూరు, పెడన, శ్రీకాళహస్తి, నరసాపురం... ఇలా రాష్ట్రంలో అనేక చేనేత ఉత్పత్తులు విశిష్ట గుర్తింపు పొందాయి. 1.27 లక్షల మంది చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. నేతన్న సేవ పథకమే కాదు... ఇప్పటికే నేతన్నలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్‌లూమ్ యూనిట్లకు ప్రయోజనం కలుగుతోంది. చేనేతలకు 50 ఏళ్లకే ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పెన్షన్ అందిస్తున్నాం. 85 వేల మంది చేనేతలకు ఫించన్‌గా రూ.4 వేల చొప్పున నెలకు రూ.35 కోట్లు ఇస్తున్నాం. రూ.420 కోట్లు ఏడాదికి ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ ద్వారా రూ.79 కోట్లు ఇచ్చాం. స్మాల్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం కింద రూ.10 కోట్ల వ్యయంతో 10 చేనేత క్లస్టర్లకు ఆమోదం పొందాయి. హ్యాండ్లూమ్ మార్కెటింగ్ అసిస్టెన్స్ కార్యక్రమంతో నేత కార్మికులకు నేరుగా మార్కెట్ అవకాశాలు వచ్చాయి. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు ఏర్పాటు చేస్తున్నాం. అమరావతి లోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం కూడా వస్తోంది. విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల పెట్టుబడితో సుస్థిర టెక్స్‌టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుంది."అని సీఎం చంద్రబాబు అన్నారు.

**బీసీలకు అండగా...** "బీసీలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా నిలుస్తోంది. వారి సంక్షేమం కోసం పని చేయడంతోపాటు... రక్షణ కల్పించేందుకు చట్టం చేస్తున్నాం. దీని కోసం ముసాయిదా ఇప్పటికే సిద్ధమైంది.

**మినీ ముంబై చీరాలకు పూర్వవైభవం తెస్తాం"** చీరాల పేరు వింటేనే ఇక్కడి నేతన్నల నైపుణ్యం గుర్తుకు వస్తుంది. చీరాల పట్టు, కాటన్ చీరలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. చీరాల ఖర్చీఫ్‌లు ఒకప్పుడు విదేశాలకు భారీగా ఎగుమతి అయ్యేవి. చేనేత ఉత్పత్తుల్లో ఒకప్పుడు 'మినీ ముంబై'గా పేరొందిన చీరాలకు పూర్వ వైభవం తెస్తాం. పర్యాటకుల్ని ఆకట్టుకునేలా సూర్యలంక, బాపట్ల, చీరాల సముద్ర తీర ప్రాంతాలను తీర్చిదిద్దుతున్నాం. రూ. 97 కోట్ల స్వదేశ్ దర్శన్ నిధులతో సూర్యలంక నుంచి చీరాల వరకు పర్యాటక కారిడార్ ఏర్పాటు చేస్తున్నాం."అని ముఖ్యమంత్రి చెప్పారు. తన ప్రసంగం అనంతరం బాపట్ల జిల్లాలో వివిధ శాఖలకు చెందిన అధికారుల పని తీరుపై తన వద్దనున్న నివేదికను ప్రజలకు చదివి వినిపించారు. చక్కగా పని చేసిన వారిని ప్రజలు అభినందించాలని సూచించారు. సంతృప్తికరంగా పని చేయని అధికారులను పనితీరు మరింత మెరుగు పరుచుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివిధ స్టాళ్లను సీఎం చంద్రబాబు సందర్శించారు. సీబీఎన్ జీవిత చరిత్రను ఆవిష్కరిస్తూ మహతి అనే యువతి 40 పెన్సిళ్లతో రూపొందించిన మైక్రో ఆర్ట్ ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. బాపట్ల, సూర్యలంక సహా జిల్లాలోని వివిధ బీచ్ ల సమాచారాన్ని ప్రజలకు అందించేలా రూపొందించిన బే ఆఫ్ బాపట్ల వెబ్ సైట్, హ్యాండ్ బుక్ ను సీఎం విడుదల చేశారు. బాపట్ల లీప్స్ పేరుతో వివిధ రంగాల్లో యువతకు అందించే శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. చేనేత రంగ అభివృద్ధికి సంబంధించి ఫ్యాబ్ ఇండియా సహా నాలుగు సంస్థలతో సీఎం చంద్రబాబు సమక్షంలో అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు. మంత్రులు సవిత, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, బాపట్ల జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు

# వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతిపై మంత్రి నిమ్మల సమీక్ష

**విజయవాడ,మన జనప్రగతి ఆగస్టు 07:** ఈఎన్సీ నరసింహమూర్తి, ప్రాజెక్ట్ సిఈ, ఎస్ఈ, ఈఈలు, ఏజెన్సీల ప్రతినిధులతో మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నల్లమల సాగర్ రిజర్వాయర్‌కు కృష్ణా జలాల తరలింపుకు తీసుకోవలసిన చర్యలపై సమీక్ష. చేసారు. ఈనెల మూడో వారంలో నల్లమల సాగర్ కు నీళ్ళు తరలించేందుకు సిద్ధంగా, చెక్ మెమో ఇవ్వాలని అధికారులను ఆదేశించిన మంత్రి నిమ్మల కొల్లం వాగు నుండి టన్నెల్స్ ద్వారా, కృష్ణా జలాలు తరలించేందుకు అప్రోచ్ ఛానెల్ క్లియర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. రెండు టన్నెల్స్ లో మిగిలిన 286 మీ లైనింగ్ పనులు మరో 10 రోజుల్లో పూర్తి కానున్నట్లు వెల్లడించారు.

కాగా టన్నెల్-2లో చిక్కుకున్న టిబిఎం మెషిన్ తొలగింపు సైతం మరో వారంలో పూర్తికానుంది.1900 మెట్రిక్ టన్నుల టిబిఎం మెషిన్ నుండి, నేటికి 1300 మెట్రిక్ టన్నులు, టన్నెల్ నుండి వెలికి తీశారు.మిగిలిన 600 మెట్రిక్ టన్నులను 10 రోజుల్లో పూర్తిగా వెలికితీయనున్నారు. గత 5ఏళ్ళ వైసిపి పాలనలో టిబిఎం తొలగించలేక చేతులెత్తేసి, చుక్కనీరు కూడా ఇవ్వకుండా జాతికి అంకితం అనే డ్రామా ఆడారని మంత్రి ఈ సందర్భ ంగా పేర్కొన్నారు. .నిర్వాసితులకు 900 కోట్లకు పైగా ఆర్అండ్ఆర్ పరిహారం ఇవ్వాల్సి ఉండగా, ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా గత ప్రభుత్వం మోసం చేశారని, తమ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు లో మొత్తం 7321 నిర్వాసిత కటుంబాలకు గానూ, 2560 కుటుంబాలకు 318 కోట్లు చెల్లించగా, ఈవారంలో 2863 కుటుంబాలకు 353 కోట్లు చెల్లించాలని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిపారు. మిగిలిన 1898 నిర్వాసిత కుటుంబాలకు, ఈనెలాఖరులోపుగా 210 కోట్లు చెల్లించనున్నట్లు చెప్పారు.

# రాష్ట్రంలో భారీగా ఐఎఎస్‌ల బదిలీ

(మొదటి పేజీ తరువాయి)

విభాగం కమిషనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమించింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలిని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిపాలనా వ్యవస్థలో కీలక మార్పులు చేపట్టింది. మొత్తం 22 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ, కొత్త పోస్టింగ్‌లను కేటాయించింది. పర్యాటకం, పాఠశాల విద్య, రవాణా, ఆరోగ్యం, హౌసింగ్, టీటీడీ, వీఎమ్ఆర్‌డీఏ, ఏపీ టూరిజం తదితర కీలక శాఖల్లో ఈ మార్పులు చోటుచేసుకున్నాయి. రానున్న గోదావరి పుష్కరాల కోసం సురేశ్ కుమార్, భరత్‌లను ప్రత్యేక అధికారులుగా నియమించింది ప్రభుత్వం. తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గా ఎం.జయకృష్ణ, ఏపీఎస్‌ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా శివప్రసాద్ నియమితులయ్యారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బాధ్యతల నుంచి ఆమ్రపాలిని రిలీవ్ చేసిన ప్రభుత్వం.. ఆమెను సాధారణ పరిపాలన శాఖకు రిపోర్ట్ చేయాలని ఆదేశించింది.

అలాగే.. తేజ్ భరత్, బి.అనిల్ కుమార్ రెడ్డిలను కూడా జీఏడీకి రిపోర్ట్ చేయాలని సూచించింది. పి.రవి సుభాష్‌కు ఏపీటీడీసీ ఎండీగా బాధ్యతలప్పగించింది. ఇక.. పురావస్తు శాఖ కమిషనర్‌గా ముత్యాలరాజు, ఆరోగ్య శాఖ కమిష నర్‌గా చక్రధర్ బాబుకు అదనపు బాధ్యతలు, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్‌గా అరుణ్ బాబు నియమితులయ్యారు. విశాఖపట్నం మహానగర ప్రాంత అభివృద్ధి సంస్థ కమిషనర్‌గా ప్రఖర్ జైన్, టీటీడీ జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా ప్రభల గోపీనాథ్, ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పద్మావతి నియమితులయ్యారు. హౌసింగ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా హెప్సిబా రాణి, ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బి.సునీల్ కుమార్ రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. భారీ స్థాయి ఐఏఎస్ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. పలు ముఖ్య శాఖలకు కొత్త అధికా రులను నియమించడం ద్వారా ప్రభుత్వ యంత్రాం గంలో మరింత సమర్థవంతమైన పాలనకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు అధికార వర్గాలు భావిస్తున్నాయి.

# వైసీపీ నిరాధార ఆరోపణలు చేస్తోంది


(మొదటి పేజీ తరువాయి)

స్పందించారు.మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన 16 వేల మంది యువత ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ సంతోషంగా ఉన్నారని మంత్రి తెలిపారు. డీఎస్సీ ప్రక్రియను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేసినా న్యాయస్థానాల్లో వారికి ఎదురుదెబ్బ తగిలిందన్నారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టును కూడా భర్తీ చేయలేదని మంత్రి ఆరోపించారు. విద్య, ఉద్యోగాల కల్పనకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ త్వరలో మరోసారి జాబ్ క్యాలెండర్ విడుదల చేయనున్నారని తెలిపారు.మరిన్ని ఉద్యోగాల భర్తీ జరగబోతుందనే భయంతోనే వైసీపీ నేతలు నిరాహార దీక్షల పేరుతో రాజకీయ డ్రామాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ప్రతిపక్షం రాజకీయ లబ్ధి కోసం నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వైసీపీ తీరును ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి రాజకీయాలకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని మంత్రి నారాయణ అన్నారు.

# ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది

**● మిషన్ భగీరథ దేశానికే ఆదర్శం ● ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన వ్యవస్థ**

**● కాంగ్రెస్ నిర్లక్ష్యంతో నిర్వీర్యం : మాజీమంత్రి హరీశ్‌రావు**



**హైదరాబాద్,మన జనప్రగతి ఆగస్టు 07:** తెలంగాణలో ప్రతి ఇంటికీ సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన మిషన్ భగీరథ పథకం నేటితో పదేండ్లు పూర్తి చేసుకోవడం సంతోషకరమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు తెలిపారు. తెలంగాణలో ఇంటింటికీ తాగునీటి విప్లవానికి దశాబ్ది కాలం పూర్తయ్యిందని ఎక్స్ వేదికగా శుక్రవారం వీడియోను షేర్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణలో ఫ్లోరోసిస్ రక్కసిని రూపుమాపిన సుజల వ్యవస్థగా పేరుగాంచిందని వివరించారు. మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితో రూపుదిద్దుకున్న మిషన్ భగీరథ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిర్వీర్యమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సరిగ్గా పదేండ్ల క్రితం ఇదే రోజు గొప్ప ఆలోచనతో ప్రారంభమైన ఈ పథకం ప్రజల తాగు నీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపిందని తెలిపారు. మిషన్ భగీరథ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న అతిపెద్ద తాగునీటి మౌలిక వసతుల ప్రాజెక్టుగా నిలిచిందని గుర్తు చేశారు. దేశానికి రోల్ మోడల్‌గా నిలిచి హర్ ఘర్ జల్ పథకం అయిందని పేర్కొన్నారు. మిషన్ భగీరథ ఒక పథకం కాదనీ, తెలంగాణ ప్రజల జీవితాలను మార్చిన మహత్తరమైన ప్రణాళిక అని వివరించారు.రాష్ట్రంలో ఏ ఇంట్లోనూ తాగునీటి కోసం ఇబ్బంది ఉండకూడదనీ, ఏ తల్లి కూడా బిందె పట్టుకుని కిలోమీటర్ల దూరం నడవకూడదనీ, ఏ గ్రామం కూడా వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోకూడదనే సంకల్పంతో కేసీఆర్ ప్రభుత్వం ఈ బృహత్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని తెలిపారు.

# చిన్నతరహా పరిశ్రమలకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

నిబంధనలను సవరించినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ వెల్లడించారు. జైపూర్‌లో జరిగిన 'బ్రిక్స్' వాణిజ్య, పరిశ్రమల మంత్రుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ-కామర్స్ ద్వారా అంతర్జాతీయ లబ్ధి: హ్యాండ్‌లూమ్స్, హస్తకళలు, టెక్స్‌టైల్స్, పాదరక్షలు, ఆహార ఉత్పత్తులను పెద్ద ఎత్తున ఈ-కామర్స్ వేదికల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేందుకు నిబంధనలను సరళీకృతం చేశారు. భారతదేశంలోని గ్రామీణ కళాకారులు, ఎంఎస్ఎంఈలు , రైతులకు ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లను అందుబాటులోకి తేవడమే లక్ష్యమని అన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బ్రిక్స్ దేశాల్లో పెట్టుబడులు, కొత్త ఉద్యోగ అవకాశాలు సృష్టించడంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. సభ్య దేశాల మధ్య వాణిజ్య ప్రక్రియను మరింత డిజిటలైజ్ చేయడం, కాగిత రహిత ప్రక్రియగా మార్చడం, ఓ÷ూఓఇలకు అవసరమైన ఆర్థిక సాయం వేగంగా అందించడంపై నిర్ణయాలు తీసుకున్నారు. కాగా, బ్రిక్స్ కూటమికి కామన్ కరెన్సీ ఏర్పాటు చేసే ఆలోచనకు భారతదేశం మద్దతు ఇవ్వడం లేదని ఈ సందర్భంగా పీయూష్ గోయల్ స్పష్టం చేశారు. జాతీయ చేనేత దినోత్సవం (ఆగస్టు 7) సందర్భంగా తీసుకున్న ఈ నిర్ణయం ఖాదీ, కుటీర పరిశ్రమలు, తోలు రంగానికి చెందిన కళాకారులకు ఎంతో మేలు చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

(మొదటి పేజీ తరువాయి)

కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు

**విజయవాడ,మన జనప్రగతి ఆగస్టు 07:**

డీఎస్సీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు చేయించడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విజయవాడలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు నేతృత్వంలోని దీక్షా శిబిరంపై దాడి చేసి టెంట్లు ధ్వంసం చేయడం, కార్యకర్తలు, మహిళలపై రాళ్లు, కోడిగుడ్లతో దాడులు చేయడం రాజకీయ ఉన్మాదానికి పరాకాష్ఠ అని ఆయన వ్యాఖ్యానించారు. దీక్షా శిబిరం టెంట్‌పై మూత్ర విసర్జన చేయడం, మల్లాది విష్ణును వ్యాన్‌లో తరలిస్తుంటే జెండా కర్రతో దాడికి తెగబడటం రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణతకు అద్దం పడుతోందన్నారు. దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే బాధితులైన వైసీపీ నాయకులను అరెస్ట్ చేయడం విచారకరమని బొత్స విమర్శించారు. డీఎస్సీ నియామకాల అక్రమాలపై ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని, ఈ దందాకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి నారా లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దాడులు చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రభుత్వం ఎంతగా అణచివేయాలని చూసినా ప్రజా సమస్యలపై తమ పోరాటం ఆగేది లేదని బొత్స స్పష్టం చేశారు.

# రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం

**విజయవాడ,మన జనప్రగతి ఆగస్టు 07:** ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహిస్తున్న అమరావతి పికిల్‌బాల్ లీగ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజయవాడలోని నైట్రో పికిల్‌బాల్ కేఫే వేదికగా ఈ నెల 9వ తేదీ వరకు ఈ లీగ్ పోటీలు జరగనున్నాయి. రాష్ట్రంలో పికిల్‌బాల్ క్రీడ అభివృద్ధికి ఈ లీగ్ ఒక కీలక మైలురాయిగా నిలుస్తుందని మంత్రి పేర్కొన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు, పికిల్‌బాల్ వంటి నూతన క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి మండిపల్లి అన్నారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఎమ్మెల్యే గద్దె రామోహన్నాయుడు, శాప్ చైర్మన్ రవి నాయుడు, సినీహీరో సుశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో పిడుగులతో కూడిన వర్షాలు

## - రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడి

**అమరావతి,మన జనప్రగతి ఆగస్టు 07:** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. వాయువ్య బంగాళాఖాతంలో రానున్న 24 గంటల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వర్షాలకు సంబంధించిన వివరాలను ఆ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. శనివారం ఉత్తరాంధ్రలో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ జిల్లాలకు భారీ వర్ష సూచన ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు తీరప్రాంతంలో గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పారు. తీరప్రాంత ప్రజలు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ఉత్తర, మధ్య కోస్తాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని ఆయన తెలిపారు. పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కోనసీమ, ఉభయ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు వర్ష సూచన ఉన్నట్లు పేర్కొన్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరులో వానలు పడతాయని వెల్లడించారు. అల్లూరి, అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో చెదురు మదురుగా.. మార్కాపురం ప్రాంతంతో పాటు రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. సందర్భగా ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పిడుగులతో కూడిన వర్షాల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగ్స్ వంటి వాటి వద్ద నిలబడవద్దని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08- 08 - 2026

# కర్నూల్‌లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

● పత్తికొండలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 07:**-కర్నూల్ లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు,సీనియర్ న్యాయవాదులు సత్యనారాయణ,కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని పత్తికొండ బార్ అసోసియేషన్ అధ్యక్షులు మధుబాబు ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జోష్నాదేవికి వినతి పత్రం అందించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కర్నూలుకు 90 రోజుల్లో హైకోర్టు బెంచ్ తెస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చెప్పారని తెలిపారు. కానీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సర్క్యూట్ లేదా క్యాంప్ బెంచ్ ఏర్పాటు చేస్తారని పత్రికలో రావడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఇచ్చిన మాట ప్రకారం కర్నూల్ లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు విధులు బహిష్కరించి ఆందోళనలు చేస్తున్నారని వివరించారు. అనంతరం న్యాయవాదులు ఆర్డీఓ చిన్న ఓబులేసు కు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు వైస్ ప్రెసిడెంట్ రవి కుమార్, జనరల్ సెక్రెటరీ జగదీష్, న్యాయవాదులు ప్రసాద్ బాబు, మహేష్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నెట్టేకల్లు, మునయ్య, వీరేష్,భాష, మధు నాగరాజు,సాంబ,రజాక్, నాభూషణం,శీను,వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవం నిర్వహించిన ఎమ్మార్పీఎస్

**పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు జరిగిన పోరాటాలను గుర్తు చేసిన నాయకులు**



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 07:**-ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు పత్తికొండ పట్టణంలో శుక్రవారం ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెస్పీ జిల్లా నాయకులు ఎం. రాముడు మాదిగ, జె. రామాంజినేయులు (ఠాగూర్) సూచనలతో కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...పేదలకు ఉచిత వైద్యం అందించే రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ఏర్పాటుకు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 2004లో జరిగిన చారిత్రాత్మక పోరాటాలను గుర్తు చేశారు.గుండె జబ్బులతో బాధపడుతున్న పేద చిన్నారులకు వైద్యం అందించాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే ఆరోగ్యశ్రీ పథకం రూపుదిద్దుకుందని పేర్కొన్నారు.పేదలకు ఆరోగ్య భద్రత కల్పించడంలో ఆరోగ్యశ్రీ పథకం కీలక పాత్ర పోషిస్తోందని,ఈ ఉద్యమ చరిత్రను భావితరాలకు తెలియజేయడానికే ప్రతి ఏటా ఆగస్టు 7న ఆరోగ్యశ్రీ సాధన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సుధాకర్ మాదిగ, ధనుష్ మాదిగ, రామకృష్ణ మాదిగ, మునిస్వామి మాదిగ, కార్తీక్ మాదిగ, మహానంది మాదిగ, బాలు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సుడిగాలి పర్యటన



**బనగానపల్లె/నంద్యాల, ఆగస్టు 07:**-బనగానపల్లె నియోజకవర్గంలో రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శుక్రవారం సుడిగాలి పర్యటన నిర్వహించారు. నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ముందుగా బనగానపల్లె బైపాస్‌ను సందర్శించిన మంత్రి, నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. అనంతరం బనగానపల్లె రింగ్‌రోడ్డుపై నిర్మిస్తున్న నూతన బ్రిడ్జిల అభివృద్ధి పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఆర్‌బీసీ కెనాల్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించి, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానాన్ని రచించినట్లు ప్రసిద్ధి చెందిన రవ్వలకొండ ప్రాంతాన్ని మంత్రి పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రవ్వలకొండకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించేలా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.అనంతరం బనగానపల్లె ఆర్డీవో కార్యాలయ నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. మిగిలిన పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికా రులకు సూచించారు.జుర్రేరు వాగు ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను కూడా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. ఆయా పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.మంత్రి పర్యటన సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు సంబంధిత అభివృద్ధి పనుల వివరాలను ఆయనకు వివరించారు.

# వేరుకుళ్లు (రూట్ రోట్) వ్యాధి నివారణ మరియు యాజమాన్య పద్ధతులు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 07:**- వ్యాధి సోకిన మల్బరీ మొక్కలను వెంటనే పీకి తోట నుండి తొలగించి నాశనం చేయాలి, తద్వారా వ్యాధి ఇతర మొక్కలకు వ్యాపించకుండా ఉంటుంది.వ్యాధి సోకిన మొక్క ఉన్న గోతిలో మరియు చుట్టుపక్కల నేలను సాఫ్ 2 గ్రాములు/లీటరు నీటిలో కలిపి డ్రెంచింగ్ చేయాలి.వ్యాధి సోకిన మొక్క గోతికి 10 లీటర్ల ద్రావణం పోయాలి.చుట్టుపక్కల ఉన్న ప్రతి ఆరోగ్యకరమైన మొక్కకు 5 లీటర్ల చొప్పున ఇదే ద్రావణాన్ని డ్రెంచింగ్ చేయాలి, తద్వారా వ్యాధి మరింత వ్యాపించకుండా నివారించవచ్చు. నేలలో నీరు నిల్వ ఉండకుండా మంచి డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.పొలాన్ని కలుపు మొక్కలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలి మరియు నీటి పారుదల సక్రమంగా నిర్వహించాలి.వ్యాధి తీవ్రతను బట్టి 1015 రోజుల తర్వాత అవసరమైతే మరోసారి డ్రెంచింగ్ చేయడం మంచిది.ఈ సందర్భంగా శాస్త్రవేత్త రైతులకు టుక్రా నివారణకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, మల్బరీలో సమగ్ర పోషక నిర్వహణ (ఇంటిగ్రేటెడ్ న్యూట్రియెంట్ మేనేజ్మెంట్)నాణ్యమైన ఆకుల దిగుబడి కోసం పోషణ్ ను సిఫార్సు చేసిన మోతాదులో పిచికారీ చేసే విధానం, అలాగే సిఫార్సు చేసిన మొక్కల మధ్య దూరం (స్పెసింగ్) పాటించడం యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు. అనంతరం శ్రీమతి ఎం. రాధ గారు, జిల్లా పట్టు పరిశ్రమ అధికారి, మల్బరీ సాగు మరియు పట్టుపురుగుల పెంపక గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ సబ్సిడీ పథకాల గురించి రైతులకు వివరించారు.

# ఎల్‌నినో ప్రభావంపై అప్రమత్తత..రైతులకు శాస్త్రీయ సూచనలు

**వేముల ఏ.ఓ తో కలిసి పంట పొలాలను పరిశీలించిన జె.డి.ఎ సుబ్రహ్మణ్యేశ్వరరావు**

**ప్రత్యామ్నాయ పంటలు, తేమ సంరక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన**



**వేముల మన జనప్రగతి ఆగస్టు 07:**ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. వేముల మండల వ్యవసాయ అధికారి జి.పి. ఓబులేసుతో కలిసి శుక్రవారం ఉదయం వేముల మండల పరిధిలోని గొల్లలగూడూరు, వి.కొత్తపల్లి గ్రామాల్లో వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం పర్యటించి పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించింది.గొల్లలగూడూరు గ్రామంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు (జె.డి.ఎ) సుబ్రహ్మణ్యేశ్వరరావు ఎల్‌నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు ఎల్‌నినో పరిస్థితుల్లో సాగు చేయాల్సిన ప్రత్యామ్నాయ పంటలు, తక్కువ వ్యవధిలో పండే పంట రకాలు, నేల తేమ సంరక్షణ, వర్షాభావ పరిస్థితుల్లో పంటల నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. **పంటల పరిశీలన.. రైతులకు క్షేత్రస్థాయి సూచనలు**వి.కొత్తపల్లి గ్రామంలో పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు రైతులతో మాట్లాడి ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించే యాజమాన్య పద్ధతులు,ఆలస్యంగా రుతుపవనాలు ప్రారంభమైనప్పుడు చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ సాగు విధానాలు, నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచే చర్యలపై సూచనలు అందించారు. తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. **వాతావరణ ఆధారిత సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి..!** రైతులు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలను పాటిస్తూ నేలలో తేమను సంరక్షించే శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని శాస్త్రవేత్తలు తెలిపారు. రైతుల సందేహాలను నివృత్తి చేసి,వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల నిర్వహణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం ఉటుకూరు శాస్త్రవేత్తలు డా.ప్రభాకర్‌రెడ్డి,డా.సునీల్‌కుమార్, డా.మాధురి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, పులివెందుల సహాయ వ్యవసాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జి.పి.ఓబులేసు,వ్యవసాయ శాఖ సిబ్బంది, అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

# నేతన్న సేవలో రూ.25 వేల సాయం

**ఎమ్మిగనూరు చేనేతకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొస్తాం: ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వరరెడ్డి**





**ఎమ్మిగనూరు మన జనప్రగతి ఆగస్టు 07:**-చేనేత కళాకారుల సంక్షేమం, ఆధునికీకరణ, మార్కెటింగ్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వరరెడ్డి తెలిపారు. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మిగనూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.వ్యవసాయం తర్వాత అత్యధిక ఉపాధి కల్పిస్తున్న రంగం చేనేతేనని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెబుతున్న కళాకారులు నేతన్నలేనని కొనియాడారు. ఎమ్మిగనూరు చేనేతకు ప్రత్యేక బ్రాండ్ గుర్తింపు తీసుకురావడంతో పాటు జీఐ ట్యాగ్ సాధనకు చర్యలు వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.బనవాసి గ్రామంలోని ఎంఎస్ఎంఈ పార్కులో 22 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ హ్యాండ్‌లూమ్ టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఆధునిక మగ్గాలు, డిజైనింగ్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, మార్కెటింగ్ సదుపాయాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చి చేనేత ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మరింత ఆదరణ కల్పిస్తామని పేర్కొన్నారు.'నేతన్న సేవలో' పథకం ద్వారా అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చేనేత సహకార సంఘాల బలోపేతం, యువతకు నైపుణ్య శిక్షణ, వీవర్స్ షెడ్ల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే ఎమ్మిగనూరుకు మంజూరైన తాగునీటి పథకంతో పాటు రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.అనంతరం చేనేత కార్మికుల స్వయం ఉపాధికి ప్రోత్సాహంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రూ.40 లక్షల రుణాల మంజూరుకు సంబంధించిన మెగా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగరాజు, కుర్ని కార్పొరేషన్ చైర్మన్ మిన్నప్ప, చేనేత కళాకారుడు నరసప్ప, బీజేపీ ఇన్‌చార్జ్ నరసింహులు, జనసేన ఇన్‌చార్జ్ రేఖ గౌడ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లయ్య, చేనేత కళాకారులు, అధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి..

**శాఖల సమన్వయంతో వేగవంతమైన చర్యలు: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో ఎమ్మిగనూరు మన జనప్రగతి ఆగస్టు 07:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ఒక్క నెలఒక నియోజకవర్గంనాలుగు పర్యటనలు" కార్యక్రమం నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఎమ్మిగనూరు నియోజకవర్గంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు. నియోజకవర్గం లోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల నుంచి భూ సమస్యలు, 22-ఏ నిషేధిత జాబితా, రీ-సర్వే అనంతరం తలెత్తిన వివాదాలు, ఇనాం భూముల నమోదు, పట్టా భూముల సమస్యలు, భూ విస్తీర్ణ వ్యత్యాసాలు, గృహాల మంజూరు, సంక్షేమ పథకాల అమలు, పింఛన్లు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, వ్యవసాయం, రెవెన్యూ, సామాజిక భద్రత తదితర అంశాలకు సంబంధించిన వినతులు వచ్చాయి. ప్రతి అర్జీని నిర్లక్ష్యం చేయకుండా క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా, సమయపాలనతో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలకు వచ్చే వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ,సర్వే శాఖకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నాయని, వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహించు సమయంలో చుట్టుప్రక్కల ఉన్న రైతులందరినీ నోటీసులు ఇచ్చి అందర్నీ పిలిపించుకొని సర్వే నిర్వహించాలని సర్వే శాఖ డిప్యూటీ డైరెక్టర్ అరుణ్ కుమార్ ను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆర్డీవో అరుణ దేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి, ఎస్ఈ ఆర్ అండ్ బి మహేశ్వర్ రెడ్డి,డిఆర్డిఏ పిడి శ్రీధర్, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, ఐసిడిఎస్ పిడి విజయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి సురేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు,నిరుద్యోగుల సమస్యలపై పత్తికొండలో రెండో రోజు రిలే నిరాహార దీక్షలు

**డీఎస్సీ2025 అవకతవకలపై సీబీఐ విచారణకు డిమాండ్**





**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 07:**-విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో పత్తికొండలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం రెండో రోజుకు చేరుకున్నాయి. డీఎస్సీ2025 నియామక ప్రక్రియలో అక్రమాలు, అవినీతి జరిగాయన్న ఆరోపణలపై సీబీఐతో సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువత దీక్షలు కొనసాగిస్తున్నారు.మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో జరిగిన దీక్షలో కృష్ణగిరి ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, యువజన నాయకులు పాల్గొని నిరసన తెలిపారు. నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.దీక్షలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెరుకులపాడు ప్రదీప్‌రెడ్డి, సీపీఐ రాష్ట్ర నాయకుడు రామచంద్రయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై భవిష్యత్తులో వైఎస్సార్‌సీపీతో కలిసి ఉద్యమాలు చేపట్టేందుకు సీపీఐ సిద్ధంగా ఉందన్నారు.విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ని ర్లక్ష్యంగా వ్య వహరిస్తు న్నాయని నాయకులు విమర్శించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.డీఎస్సీ2025 వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి,తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ రిలే నిరాహార దీక్షలో కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.

## భక్తులకు శాకంబరిగా దర్శనం ఇచ్చిన కనకదుర్గమ్మ



**కాకినాడ మన జనప్రగతి ఆగస్టు 07:**-గాంధీనగర్ రామారావు పేట రైతు బజార్ ఆవరణలో వేంచేసి అన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారు ని శాఖంబరిగా అలంకరించారు. ఉదయం 7:00 గంటల నుండి అమ్మవారు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు సేకరించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శేషు కుమార్ మాట్లాడుతూ భక్తులు సహాయ సహకారాలతో మొదటి సంవత్సరం గా అమ్మవారిని ఆలయ ప్రాంగణాన్ని వివిధ రకాల కాయగూరలతో పళ్ళతో అలంకరించారు. మీ అమ్మవారి సేవలో దంటు మహంతి లక్ష్మణరావు,కుమార్,కునపురెడ్డి శంకర్ నారాయణ,దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో 41 వ వార్డ్ కూటమి నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవం కార్యక్రమం




**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 07:**-మండల పరిధిలోని సంతకొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చెర్లోపల్లి గ్రామం నందు ఆరోగ్య శాఖ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖలు కలిసి సంయుక్తంగా తల్లిపాల వారోత్సవ కార్యక్రమం ను నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి డి. సుబ్రమణ్యం మరియు ఐ.సి.డి.యస్ సూపర్వయిసర్ పి. వసంత మాట్లాడుతూ... గర్భవతులకు, బాలింతలకు, పాలిచ్చు తల్లులకు తల్లిపాల ఆవశ్యకత, ప్రాముఖ్యత గురించి వివరించడం "ముర్రుపాలు శిశువు కు మొదటి టీకా" గా పనిచేస్తుందని, బిడ్డ పుట్టిన తర్వాత అరగంట నుండి గంటలోపల బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని తెలిపారు. తల్లిపాలు ఇవ్వటం వల్ల తల్లికి,మరియు బిడ్డకు కలిగే ప్రయోజనాలను గురించి వివరించడం జరిగింది. ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## రోగుల సేవలో ఏఐఎంఐఎం నాయకులు



**ఆదోని మన జనప్రగతి ఆగస్టు 07:**ఆసుపత్రికి వచ్చే రోగులకు వారం వారం ఏదో విధంగా సేవా అందించడం ఏఐఎంఐఎం నాయకుల సేవా అని ఏఐఎంఐఎం ఆదోని పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ జునైద్ అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఆదోని ఏరియా ఆసుపత్రిలో ఏఐఎంఐఎం నాయకులు వారం వారం పంపిణీ చేస్తున్నట్లుగానే ఈ వారం రోగులకు, వారి బంధువులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఐఎంఐఎం నాయకులు చేస్తున్న సేవ గుణాన్ని రోగులు ప్రజలు కొనియాడారు. వారం వారం అల్పాహారం,పాలు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేయడం ఈ సేవా కార్యక్రమంలో భాగమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం నాయకులు సద్దాం హుస్సేన్, నాసిర్ హుస్సేన్, సెక్స్ వలి తదితరులు పాల్గొన్నారు.

## చెన్నూరులో త్రాగునీటి పైప్ లైన్ లీకేజ్ పై స్పందించిన అధికారులు వెంటనే మరమ్మతులు



**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 07:**-మండల కేంద్రమైన చెన్నూరు 12వ వార్డులోని భవాని నగర్ స్టేట్ బ్యాంకు వద్ద త్రాగునీటి పైప్లైన్ లీకేజ్ కావడంతో గత రెండు రోజులుగా మరమ్మతులకు నోచుకోలేదు, త్రాగునీటి పైప్లైన్ పక్కనే డ్రైనేజీ కాలువ ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతూ ఉండడంతో ఏ విషయంపై "మన జన ప్రగతి" దినపత్రికలో శుక్రవారం వార్త రావడంతో స్పందించిన స్థానిక అధికారులు వెంటనే మరమ్మతు పనులు చేపట్టారు, గ్రామపంచాయతీ అధికారి జగదీశ్వర్ రెడ్డి దెబ్బతిన్న పైప్ లైన్ ను పరిశీలించి మరమ్మత పనులు నిర్వహించారు,

## ప్రొద్దుటూరులో 2వ రోజూ కొనసాగిన వైఎస్సార్సీపీ రిలే నిరాహార దీక్ష




**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 07:**-డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని, నిరుద్యోగ భృతి తదితర డిమాండ్ల సాధన కోసం వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయం ప్రధాన గేటు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నిర్వహించిన రెండో రోజు దీక్షలో రాజుపాలెం మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు, యువకులు, మహిళలు, అలాగే నియోజకవర్గ వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగానికి చెందిన సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్సీపీ ఎస్ఈసీ సభ్యుడు మెట్టుపల్లె ప్రభాకర్ రెడ్డి, రాజుపాలెం మండల జడ్పీటీసీ అంజనీదేవి గోవర్ధన్ రెడ్డి, వెలవలి నారాయణ రెడ్డి, వెల్లాల సత్యం తదితర నాయకులు హాజరై దీక్షకు తమ మద్దతు ప్రకటించారు.

## హ్యాపీ కిడ్స్ స్కూల్లో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవ వేడుకలు

**• చేనేత కార్మికులకు ఘనంగా సత్కారం**



**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 07:**-జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్ధవటం మండలం ఉప్పరపల్లి సాయినగర్‌లోని హ్యాపీ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం చేనేత కార్మికులను ఘనంగా సత్కరించారు. పాఠశాల కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిడిపి ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. అర్హులైన నేతన్నలకు ఏడాదికి రూ.25 వేల ఆర్థిక సహాయం, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం భరోసా కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వం ముడిసరుకుల ధరలు పెరగడంతో నేతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ మాట్లాడుతూ మాధవరం ప్రాంతంలో విద్యాభివృద్ధికి కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పట్టు, ముడిసరుకుల అధిక ధరల సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడ విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతన్నల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని అన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, డాక్టర్ వీరభద్రుడు, ఒంటిమిట్ట జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జయకృష్ణ, రాష్ట్ర పంచాయతీ రాజ్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య, రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, సిద్దవటం సింగిల్ విండో అధ్యక్షుడు దశరథ రామా నాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ప్రతినిధి దేరంగుల శ్రీకాంత్, టిడిపి మండల అధ్యక్షుడు రాజశేఖర్, పార్లమెంట్ ఉపాధ్యక్షుడు నాగమునిరెడ్డి, మాజీ జడ్పీటీసీ చలమయ్య యాదవ్, కరస్పాండెంట్ అనిల్ కుమార్ రెడ్డి, చేనేత కార్మికులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి కాలువకట్ట నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

**- మంత్రి నారాయణ.. మూడు కిలోమీటర్లు కాలినడకన పర్యటన**



**నెల్లూరు, మన జనప్రగతి, ఆగస్టు 07:**- నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని సర్వేపల్లి కాలువకట్టపై నివసిస్తున్న నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం మంత్రి నారాయణ అధికారులతో కలిసి సుమారు మూడు కిలోమీటర్ల మేర కాలువకట్టపై కాలినడకన పర్యటించి నిర్వాసితుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దాదాపు 60 ఏళ్లుగా ఇక్కడ నివసిస్తున్న కుటుంబాలు శాశ్వత పట్టాల కోసం ఎదురుచూస్తున్నాయని మంత్రి తెలిపారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు సర్వేపల్లి కాలువకట్టపై సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. సర్వే నివేదిక, నిబంధనలను పరిశీలించి అర్హత ఉన్న కుటుంబాలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయంతో సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి స్పష్టం చేశారు. మంత్రి హామీపై నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా స్థానిక మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో నెల్లూరు నగర మేయర్ సుజాత, కమిషనర్ నందన్, ఎంఆర్ఓ వెంకటలక్ష్మి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, స్థానిక టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తల్లిపాలే బిడ్డకు తొలి అమృతం

**• తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 07:** సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ (ఎస్ఐఆర్డీఎస్) ఆధ్వర్యంలో పట్టణంలోని రజకవాడ అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా రెండో వార్డు మాజీ కౌన్సిలర్ ద్వార్సల భారతి మాట్లాడుతూ, తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని, ప్రతి తల్లి తన బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ కటారు మానస మాట్లాడుతూ...తల్లిపాలు శిశువు ఎదుగుదల, శారీరకమానసిక అభివృద్ధికి అవసరమైన అన్ని పోషకాలను అందిస్తాయని తెలిపారు. తల్లిపాలలో ఉండే యాంటీబాడీలు శిశువుకు రోగనిరోధక శక్తిని పెంచి వివిధ రకాల ఇన్ఫెక్షన్లు, చెవి ఇన్ఫెక్షన్లు, గ్యాస్ట్రోఎంటరైటిస్, నిమోనియా వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం వల్ల భవిష్యత్తులో ఊబకాయం,రక్తపోటు,మధుమేహం వంటి సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయని వివరించారు. అలాగే తల్లిపాలు ఇవ్వడం వల్ల ప్రసవానంతర రక్తస్రావం తగ్గి గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి వస్తుందని,తల్లిబిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తల్లిపాలు ఎల్లప్పుడూ సరైన ఉష్ణోగ్రతలో ఉండటంతో పాటు కుటుంబానికి ఆర్థిక భారం కూడా తగ్గుతుందని తెలిపారు. తల్లికి రొమ్ము క్యాన్సర్,గర్భాశయ ముఖద్వార క్యాన్సర్,గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుందని చెప్పారు. జననం నుంచి ఆరు నెలల వరకు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని,అనంతరం అదనపు ఆహారం ప్రారంభించినప్పటికీ రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. ఎస్ఐఆర్డీఎస్ సొసైటీ అధ్యక్షులు ఎం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ..ప్రతి తల్లి బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. వార్డు హెల్త్ సెక్రటరీ ఎం.రెబకా,అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## సుగవాసి ఆదేశాలతో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం

**- ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న టీడీపీ శ్రేణులు**




**సిద్ధవటం మన జనప్రగతి ఆగస్టు 07:**- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్‌బాబు ఆదేశాల మేరకు సిద్ధవటం మండలంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని షాకరాజుపల్లి గ్రామ టీడీపీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనే లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ముమ్మడిగుంటపల్లిలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు పుత్తా రామచంద్రయ్య, రాజంపేట నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరువ చేయడమే ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. ప్రజల సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేసి, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఆనే లక్ష్మీనారాయణ, ఆనే రామచంద్రయ్య, మల్లెం పుల్లయ్య, ఏకసిరి నరసింహులు, కబడ్డీ శివ, అల్లం సూరి, సిద్ధవటం మండల టీడీపీ మాజీ యూనిట్ ఇన్‌చార్జి పుత్తా శివానంద, పుత్తా కిశోర్, మునిగళ్ల సుబ్బయ్యతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

## నేడు తొండూరు మండలంలో విద్యుత్ అంతరాయం

**బలపనూరు 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనులు**

**ప్రజలు,రైతులు సహకరించాలని ఏఈ వి. బాలసంజీవులు విజ్ఞప్తి**

**తొండూరు మన జనప్రగతి ఆగస్టు 07:**- బలపనూరు 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో నిర్వహించే మరమ్మత్తు పనుల కారణంగా శనివారం ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తొండూరు మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వి.బాలసంజీవులు తెలిపారు. బలపనూరు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ పొందుతున్న 33/11 కేవీ భద్రంపల్లె, తొండూరు, మల్లెల సబ్‌స్టేషన్ల పరిధిలోని గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఈ సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మరమ్మత్తు పనులు పూర్తయిన అనంతరం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు, రైతులు విద్యుత్ శాఖకు సహకరించి అసౌకర్యాన్ని సహనంతో స్వీకరించాలని ఏఈ వి. బాలసంజీవులు విజ్ఞప్తి చేశారు.

## డీఎస్సీ బాధితులు,విద్యార్థుల బకాయిల కోసం జరిగే రిలే దీక్షను విజయవంతం చేయండి..!

**వేముల మండల వైకాపా మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి పిలుపు..**

**"నేడు పులివెందుల ఆర్డీవో కార్యాలయం వద్ద" ఉదయం 9 గంటలకు నిరసన కార్యక్రమం**



**వేముల మన జనప్రగతి ఆగస్టు 07:**- డీఎస్సీ బాధితులు,విద్యార్థుల బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో నేడు (శనివారం) రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు వైకాపా వేముల మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ యువత,విద్యార్థులు, వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన ద్వారా ఈ విషయాన్ని వెల్లడిస్తూ...వైఎస్సార్సీపీ అధ్యక్షులు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు,కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆధ్వర్యంలో వేముల, వేంపల్లి మండలాల పరిధిలోని డీఎస్సీ బాధితులు,విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని,విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ...ఈ రిలే నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నేడు ఉదయం 9:00 గంటలకు పులివెందుల ఆర్డీవో కార్యాలయం వద్ద జరిగే రిలే నిరాహార దీక్షలో బాధితులు, విద్యార్థులు,నిరుద్యోగ యువత, వైకాపా నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాగేళ్ల సాంబశివరెడ్డి కోరారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08- 08 - 2026

## 9న చెన్నూరు శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి ఆషాడ మాస అమ్మవారికి చీరె సారె

**• 12న చౌడేశ్వరి దేవి 97వ పుట్టినరోజు ఉత్సవాలు**





**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 07:**-చెన్నూరు పెన్నా నది తీరంలో పరమట వీధిలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి అమ్మవారికి ఆషాడ మాస ఆదివారం 9న చీరెసారె నిర్వహిస్తున్నారు, చెన్నూరు సరస్వతి నగర్ లో వెలసిన శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర నుంచి చౌడేశ్వరి దేవికి మహిళలు పసుపు కుంకుమ పూలు పండ్లు గాజులు టెంకాయ మరియు చీరెసారె పూజా సామాగ్రి తో మంగళ వైద్యాలతో పురవీధుల గుండా అమ్మవారి ఆలయం వరకు వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు, 12న బుధవారం శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవి 97వ పుట్టినరోజు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు, అమ్మవారికి అభిషేక పూజలు ప్రత్యేక అలంకరణ నిర్వహిస్తున్నారు, ఉదయం 11 గంటలకు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో ఉంజల సేవ నిర్వహిస్తున్నారు, మధ్యాహ్నం 12 గంటల నుంచి మహా అన్న ప్రసాద వితరణ ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాటు చేస్తున్నారు, 9న 12న జరిగే అమ్మవారి కార్యక్రమాలకు ఆలయ కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు విస్తృతంగా చేస్తున్నారు,

## ఆరుతడి పంటలైన చిరుధాన్యాలు సాగు చేసుకోవాలి




**చిట్వేలి మన జనప్రగతి ఆగస్టు 07:**రైతులు ఎల్‌నినో కారణంగా వర్షాభావ పరిస్థితులు తట్టుకునే ఆరుతడి పంటలైన చిరుధాన్యాలు, నూనె గింజలు సాగు చేయాలని రైల్వే కోడూరు సహాయ వ్యవసాయ సంచాలకులు మణి సూచించారు. చిట్వేలి మండల పరిధిలో గల వివిధ పంటలను తిరుపతి శాస్త్రవేత్తలు బృందం పరిశీలించి పంటలపై ఎల్‌నినో ప్రభావం గురించి, రైతులకి వచ్చే సమస్యలపై సూచనలు, సలహాలు అందజేశారు. రైతులు ఎల్‌నినో ప్రభావం తగ్గించడానికి తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకి వివరించారు. రైతులు వర్షాభావ పరిస్థితులు తట్టుకొనే ఆరు తడి పంటలైన చిరు ధాన్యాలు, అపారలు, నూనెగింజలు సాగు చేయాలనీ సూచించారు. ఫ్రీ మ్యాన్సూన్ డ్రై సౌయింగ్ కిట్స్, జీవన ఎరువులని వాడి రసాయానిక ఎరువులని తగ్గించడం ద్వారా నేల ఆరోగ్యం కాపాడుతూ పంటలు పండించాలని కోరారు. ఎక్కడైనా ఎల్‌నినో ప్రభావంతో నీటి వసతి తగినట్లు అనిపిస్తే రైతులు పంటలకు ఆరు తడులు ఇస్తూ పొటాషియం నైట్రేట్ లేదా 19-19-19 లీటర్ నీటికి 10 గ్రాములు చొప్పున పిచికారి చేసుకోవాలని సూచించారు. నేటి నుండి సీజన్ అయ్యేవరకు గ్రామ స్థాయిలో సిబ్బంది ఎల్‌నినో వల్ల ఎక్కడ ఇబ్బంది ఉన్నా పరిశీలించి రైతులకి తగిన సూచనలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.తిరుపతి ప్రాంతీయ పరిశోధనా స్థానం ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణ, తిరుపతి ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల డాక్టర్ లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకళ, ఎస్వి అగ్రికల్చరల్ కాలేజీ విద్యార్థులు, చిట్వేలి మండల వ్యవసాయ అధికారి సుధాకర్, ఉద్యాన శాఖాధికారి లోకేష్, అగ్రికల్చరల్ కాలేజీ విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

## స్వామివారి భూములు స్వామి చెంతకే..!



**పోరుమామిళ్ల మన జనప్రగతి ఆగస్ట్ 07:-** బి.కోడూరు మండలం మున్నెల్లి గ్రామ సర్వే నెంబర్ 39-బి మద్దిమాను గురప్ప స్వామి భూములు ఆక్రమణకుగురై రాష్ట వ్యాప్తంగా సంచలనాలు రే కెత్తించిన విషయం తెలిసిందే. ఎట్టకేలకు స్వామి భూములు స్వామి వద్దకే చేరుకోవడం జరిగింది. సదరు సర్వేనెంబర్ 39-బి లోని 2.23 ఎకరాల భూమిని 2022 సంవత్సరంలో మున్నెల్లి గ్రామానికి చెందిన బి.కోడూరు టీడీపి మండల అధ్యక్షుడు ఓకిలి రామచంద్రారెడ్డి జౌకుపల్లి గ్రామానికి చెందిన బసిరెడ్డి నాగార్జున రెడ్డికి విక్రయించడం జరిగింది.ఈ సర్వే నెంబర్ భూమిపైన రకరకాలుగా బ్యాంకు లావాదేవీలు కూడా జరిగినట్లు సమాచారం.39-బి సర్వే నెంబర్ పై మీడియా ద్రుష్టి మరల్చడం భక్తుల్లో గందరగోళ పరిస్థితులు ఏర్పడటంతోపాటు అందుకు సంబంధించిన రెవిన్యూ రికార్డులు సయితం మద్దిమాను గురప్ప స్వామి భూములే అని తేల్చడం జరిగింది. విషయం సీఎం కార్యాలయం దృష్టికి పోవడంతో ఉలిక్కిపడ్డ దేవాదాయ, ధర్మాదాయ శాఖ వెంటనే మేల్కొని ఈ భూమి శ్రీ శ్రీ మద్దిమాను గురప్ప స్వామికి చెందినదే అని ఖరాఖండిగా తేల్చి చెప్పడంతో..అమ్మిన ఓకిలి రామచంద్రా రెడ్డి, కొన్న బసిరెడ్డి నాగార్జునరెడ్డి ఆగస్ట్ 6న బద్వేల్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమిపై తమకు వున్న హక్కును రద్దు చేసుకొని తిరిగి స్వామి వారికి వ్రాయించడంతో స్వామి భూములు భూములు స్వామి చెంతకే చేరుకో వడం జరిగింది.శుక్రవారం దేవస్థానం ఈఓ క్రిష్ణయ్య, ఛైర్మెన్ మల్లికార్జునరెడ్డి మద్దిమాను గురప్ప స్వామి దేవస్థానం ఆవరణలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రద్దుకు సంబంధించిన అధికారిక డాక్యుమెంట్లు, గురప్ప స్వామికి చెందిన వివిధ మాణ్యాల పత్రాలు వెల్లడించడం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం ఈవో క్రిష్ణయ్య, ఛైర్మెన్ మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ...భవిష్యత్తులో తిరిగి ఇలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు.39-బి లోని 2.23 ఎకరాల్లో మాత్రమే అలా జరిగిందని మిగిలిన స్వామి వారి అన్ని భూములు భద్రంగా వున్నాయని, భక్తులు కంగారు పడాల్సిన అవసరం లేదని అన్నారు.స్వామి వారికి సంబంధించిన అన్ని సర్వే నెంబర్ల లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వేణు మా ధవ శర్మ, దేవస్థానం కమిటీ మెంబర్లు ధనరాజ్,బాలిరెడ్డి,బాలశేఖర్,దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

## డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణకు వైఎస్సార్‌సీపీ డిమాండ్



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 07:**-డీఎస్సీ2025 నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. స్పోర్ట్స్ కోటా నియామకాలపై కూడా పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ఎన్నికల హామీ మేరకు నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను పారదర్శకంగా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు ఇబ్బందులు తొలగించాలని కూడా కోరారు.

## మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనం



**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 07:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ, యువతకు భారీ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంటే, ఆ విజయాన్ని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు మరోసారి బురదజల్లే రాజకీయాలకు తెరలేపారు.తమ ఐదేళ్ల పాలనలో ఒక్క మెగా డీఎస్సీ కూడా నిర్వహించలేక, లక్షలాది మంది నిరుద్యోగ యువత జీవితాలతో చెలగాటమాడిన వైసీపీకి ఇప్పుడు డీఎస్సీ గురించి మాట్లాడే నైతిక హక్కే లేదు. అధికారంలో ఉన్నప్పుడు యువతను మోసం చేసినవారు, ఇప్పుడు పారదర్శకంగా జరిగిన నియామకాలపై నిరాధార ఆరోపణలు చేయడం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం.మెగా డీఎస్సీ నియామకాలు పూర్తిగా నిబంధనలకు లోబడి, పారదర్శకంగా జరిగాయి. ఎలాంటి అవకతవకలు జరగలేదు. నిజంగా ఆధారాలు ఉంటే సంబంధిత అధికార సంస్థల ముందు ఉంచాలి. అంతేగానీ మీడియా సమావేశాలు పెట్టి అబద్ధపు ప్రచారం చేయడం వల్ల నిజాలు మారవు.వైసీపీ నాయకులు ఒక విషయం గుర్తుంచుకోవాలి. ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారు, అబద్ధపు ప్రచారాన్ని కాదు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనతో ముందుకు సాగుతుంటే, వైసీపీ మాత్రం అసత్య ప్రచారం, బురదజల్లే రాజకీయాలకే పరిమితమైందని మరోసారి రుజువైంది.నిరుద్యోగ యువతలో భయాందోళనలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ సహించరు. కూటమి ప్రభుత్వం నిజాయితీగా పనిచేస్తూనే ఉంటుంది. అభివృద్ధి మా లక్ష్యం... అబద్ధపు ప్రచారం వైసీపీ లక్ష్యం అనే విషయం రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే స్పష్టమైంది, అని ఆయన తెలిపారు.


## శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సీలో బోనాల పండుగ సంబరాలు



**శేరిలింగంపల్లి మన జనప్రగతి ఆగస్టు 07:**-కొండాపూర్ శ్రీరామ్ నగర్ ' బి 'బ్లాక్ లో ఉన్న శ్రీనిధి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణమంతా వేపాకుల తోరణాలతో, పసుపు, ఎరుపు రంగులతో అందంగా అలంకరించారు. మహాకాళి అమ్మవారిని అందంగా అలంకరించి మహిళా పీఠంపై ప్రతిష్టించారు. విద్యార్థినీలు సంప్రదాయ దుస్తులలో అందంగా అలంకరించుకొని ఒక్కొక్కరు ఒక్కొక్క గ్రామదేవతలా కనిపించారు. ప్రిన్సిపాల్ సుధా మాట్లాడుతూ. ఇది ముఖ్యంగా హిందువుల పండుగ, ఈ ఆషాఢమాసంలో వర్షాలు బాగా కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకుంటూ భోజనాన్ని బోనంగా సమర్పిస్తామని తెలియజేశారు. అమ్మవారికి పూజలు , పసుపు, కుంకుమ, వైభోద్యం చీరలు ఫ్రూట్స్ సమర్పించి వేడుకొంటామని చెప్పారు. చివరగా పాఠశాల విద్యార్థులను సమస్త ప్రజలను చల్లగా చూడాలని కోరుకుంటున్నానని అమ్మవారిని వేడుకొంటూ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

## మైలవరం జలాశయం నుంచి వదిలిన నీరు పెన్నా నది ఆది నిమ్మాయపల్లి ఆనకట్టకు చేరిక





**చెన్నూరు మన జనప్రగతి ఆగస్టు 07:**-కడప నగరానికి త్రాగునీటి అవసరాల కోసం మైలవరం జలాశయం నుంచి వదిలిన నీరు ఎటుకేలకు పది రోజుల తర్వాత వల్లూరు మండలం ఆది నిమ్మాయిపల్లి పెన్నా నది ఆనకట్ట వద్దకు శుక్రవారం ఉదయానికి చేరుకున్నాయి,గండికోట జలాశయం నుంచి త్రాగునీటి అవసరాల కోసం గండికోట జలాశయం నుంచి జిల్లా అధికారుల ఒత్తిడి మేరకు 12వేల 5వందలు క్యూషకులు నీటిని దిగువనున్న మైలవరం జలాశయంలోకి వదిలారు.మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి 7వేల5వందల క్యూసెక్కులు దశలవారీగా వదిలారు. అతి కష్టం మీద వదిలిన నీరు పది రోజుల తర్వాత పెన్నా నది ఆది నిమ్మాయిపల్లి ఆనకట్ట వద్దకు చేరుకోగా కడప నగరానికి త్రాగునీటి అవసరాల కోసం ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట నుంచి దిగువకు వదలకుండా కేసీ కెనాల్ అధికారులు కడప కేసీ కెనాల్ మెయిన్ కాల్వ ద్వారా నీటిని వదిలారు, అక్కడి నుంచి ఫాతిమా మెడికల్ కళాశాల దగ్గర వంకకు వదిలారు, అక్కడి నుంచి బుగ్గ వంకలోకి దారి మళ్లించారు, రాచనాయపల్లి ఓబులంపల్లి గ్రామాల మీదుగా బుగ్గ వంక ద్వారా పెన్నా నది వాటర్ కండి పంపింగ్ స్కీం వరకు చేరే విధంగా ఏర్పాటు చేశారు, అక్కడ నుంచి సిద్ధవటం మండలం లింగంపల్లి మాసుపల్లి పెన్నా నది వాటర్ స్కీములు వరకు నీరు చేరే విధంగా కడప కార్పొరేషన్ అధికారులు ఏర్పాటు చేశారు, ఏదేమనప్పటికీ పది రోజుల తర్వాత ఆదినిమ్మాయి పల్లె ఆనకట్టకు నీరు చేరింది,

## రైతులు వరి పంట తగ్గించి ఆరుతడి సాగు చేయండి

**- లక్కిరెడ్డిపల్లి సహాయ సంచాలకులు జయరాణి**



**రామాపురం మన జనప్రగతి ఆగస్టు 07:**-మండలంలోని నల్లగుట్ట పల్లి గ్రామం రైతుల్‌కీ ఎన్నెన్నో ప్రభావం దాని ప్రభావం నివారణపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని లక్కిరెడ్డిపల్లి సహాయ సంచాలకులు జయరాణి నిర్వహించారు. రైతులకు ఈ కార్యక్రమము యొక్క ఉద్దేశము గురించి రైతులకు వివరించారు.రైతుసేవా సిబ్బంది రైతుల కమతాలను సందర్శించి పంట యొక్క స్థితి, విత్తన శుద్ధి సాగుచేసిన పంటల వివరాలను ఈ క్రాప్ నందు నమోదు చేయాలనీ వరి పంటలను తగ్గించి ఆరు రది పంటలను సాగు చేయాలని ఎల్ నినో ప్రభావాన్ని తగ్గించి ఆదాయ భద్రతను కాపాడుట బిందు, తుంపర సేద్యం ప్రోత్సహించుట అరుతడి ఊటలు మరియు తక్కువ కాల పరిమితి రకాల ను సాగుచేసు కోవాలని, అంతర పంటలు, మిశ్రమ పంటల సాగు చేయటమ్ వలన కలిగే ప్రయోజనాల గురించి రైతులకు వివరించారు. పంటల బీయాం గురించి రైతులకు వివరించడ మైనది. వరి పంటకు ఆగష్టు 15 వ తేది రైతు సేవ కేంద్రాలలో బీమా నమోను చేసుకోవాలని "సూచించారు ఎకరాకు వరి 840 రూపాయిలు చెల్లించాలని తెలిపారు... ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి వై నాగమణి, ప్రకృతిమును సిబ్బంది, రైతులు పాల్గొన్నారు

## "అమరావతి ఛాంపియన్‌షిప్ -2026" క్రీడాకారుల ఎంపిక



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 07:**-జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జవహర్ స్టేడియం లో "అమరావతి ఛాంపియన్‌షిప్ -2026" క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా స్థాయి అండర్ - 17 బాలురు మరియు బాలికలు మరియు అండర్ 23 పురుషులు మరియు మహిళలు అథ్లెటిక్స్, ఆర్చరీ, యోగ, బ్యాడ్మింటన్, చెస్, బాస్కెట్‌బాల్, బాక్సింగ్ మరియు కబడ్డీ ఎంపికలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహమాన్, యం.ఇ.ఓ - 2, కర్నూలు, బి.భూపతి రావు, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి,కర్నూలు టి.కృష్ణ,కార్యదర్శి,యం.జి.యఫ్, కర్నూలు, పి.డి.ఎల్/ పి.ఇ.టి.ఎల్, క్రీడ సంఘాల ప్రతినిధులు, శిక్షకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి




**ఎమ్మిగనూరు మన జనప్రగతి ఆగస్టు 07:**కోర్టులో చాలా రోజులుగా పెండింగ్లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకునేందుకు సులువైన మార్గమని, దానిని ప్రతి కక్షిదారుడు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే మధ్యవర్తిత్వం పై ప్రజలు అవగాహనలు కలిగి ఉండాలని ఎమ్మిగనూరు జూనియర్ సివిల్ జడ్జి పి. హేమ అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి పి. హేమ కక్షిదారులకు మధ్యవర్తిత్వంపై అవగాహనలు పెంచుకొని కేసులు పరిష్కరించుకోవాలన్నారు. అవగాహన కార్యక్రమం భాగంగా ప్రజలకు పాంప్లెట్లు పంచి, అవగాహన ర్యాలీ నిర్వహించారు. మధ్యవర్తిత్వాన్ని సద్వినియోగం చేసుకొని తమ కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాదులు, మధ్యవర్తిత్వపు న్యాయవాదులు, లోక్ అదాలత్ క్లర్క్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## వెలిగిల్లులో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన




**గాలివీడు మన జనప్రగతి ఆగస్టు 07:-** మండలం లోని వెలిగల్లు గ్రామంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రు పాలు తాగించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగి అంటువ్యాధుల బారిన పడకుండా ఉంటుందని తల్లులకు వివరించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సోనీ ,శారద, అంగన్‌వాడీ కార్యకర్తలు భాగ్యమ్మ ,హెల్త్ సూపర్వైజర్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమమ డోర్ టు డోర్ ప్రచారం

**దేవనకొండ మన జన ప్రగతి ఆగస్టు 07:**-దేవనకొండమండల కేంద్రంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో "రెండేళ్ల నమ్మకం అభివృద్ధి,సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించారు.టీడీపీ సీనియర్ నేత రంగన్న పాల్గొని ప్రజలను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ చర్యలను ప్రతి ఇంటికి చేరవేస్తూ ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ కుక్కల తిమ్మయ్య, డిస్ సుభాన్, బూత్ ఇన్చార్జులు మస్తాన్, పిండం చాంద్ భాషా, కుక్కల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి...
తెలుగు దినపత్రిక
08- 08 - 2026

# 4వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

● ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి: ఏఐటీయూసీ నాయకులు



**కడప మన జనప్రగతి ఆగస్టు 07:**ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని కడప జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. కడప నగరంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మహాసభల గోడపత్రాలను నాయకులు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కేసీ బాదుల్లా, జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్ మాట్లాడుతూ ఆటో కార్మికుల జీవన పరిస్థితులు దయనీయంగా మారాయని, వారి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో డ్రైవర్ల పిల్లలకు విద్యా సబ్సిడీ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.చంద్రన్న బీమా ద్వారా సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాద మరణానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని, 60 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు నెలకు రూ.8 వేల పెన్షన్ ఇవ్వాలని కోరారు. వాహనాల థర్డ్ పార్టీ బీమా తగ్గించాలని, ప్రైవేట్ ఫైనాన్సర్ల వేధింపులను అరికట్టి తక్కువ వడ్డీకే రుణాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, ఉచిత బస్సు ప్రయాణం వల్ల నష్టపోతున్న ఆటో కార్మికులకు ఏడాదికి రూ.30 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు.ఆగస్టు 20, 21 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే రాష్ట్ర 4వ మహాసభలకు ఆటో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉద్దె మద్దిలేటి, హరి, నారాయణ, పుల్లయ్య, శ్రీనివాసులు, షేక్ నూరుల్లా, బాబయ్య, మహ్మద్, మహేశ్వర ఆచారి, ఎన్. రమణ, హరిప్రసాద్, షేక్ మస్తాన్ సాహెబ్, శ్రీను, ఎర్రబాషా తదితరులు పాల్గొన్నారు.

# భారత్ పోర్టల్‌తో యువతకు విస్తృత అవకాశాలు

**విద్యార్థులు,యూనిట్ లీడర్లు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి**

**భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అధికారులు**



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్టు 07:-**యువతలో నైపుణ్యాభివృద్ధి,నాయకత్వ లక్షణాల పెంపు, ఉపాధి అవకాశాల కల్పన లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన మై భారత్ పోర్టల్‌ను విద్యార్థులు, యూనిట్ లీడర్లు సద్వినియోగం చేసుకోవాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యాలయ అధికారులు సూచించారు.భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం అన్నమయ్య, కడప జిల్లాల యూనిట్ లీడర్లకు గూగుల్ మీట్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ (స్కౌట్స్) శ్రీనివాసరావు, స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ (గైడ్స్) ఉమాదేవి, యువ ఆపదమిత్ర స్టేట్ గ్రోత్ కోఆర్డినేటర్ హరి పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మై భారత్ పోర్టల్ ద్వారా విద్యార్థులు, యువతకు కెరీర్ మార్గదర్శకత్వం, ఇంటర్న్‌షిప్‌లు, నైపుణ్య శిక్షణలు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, ప్రభుత్వ యువజన కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మారుతున్న పోటీ ప్రపంచంలో డిజిటల్ వేదికలను యువత వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం యువ ఆపదమిత్ర స్టేట్ కోఆర్డినేటర్ హరి మై భారత్ పోర్టల్‌లో నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా వివరించి, మొబైల్ ఫోన్ ద్వారా సులభంగా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా గ్రోత్ కోఆర్డినేటర్ గురునాథరెడ్డి,కడప జిల్లా అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ (స్కౌట్) ఖాదర్‌బాషా, రెండు జిల్లాల యూనిట్ లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం అవసరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఉషశ్రీ



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 07: -**ఉన్నత విద్యాభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని వేంపల్లి వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఉషశ్రీ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని ప్రయోజకులు కావాలన్న విషయంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర చాలా ఉందన్నారు. కళాశాలకు వచ్చే విద్యార్థులు ఏ విధంగా తరగతులకు హాజరవుతున్నారు..వారి హాజరు శాతం..ఎంత వారి విద్యా ప్రగతి..ఏమిటి అన్న విషయాలు తెలుసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఈ విషయాలన్నీ తెలుసుకునేందుకు తరచూ తల్లిదండ్రులు కళాశాలను సందర్శించాలని కోరారు.విద్యార్థుల ప్రగతి, క్రమశిక్షణ,విద్యార్థుల హాజరు,అకడమిక్ పనితీరు, పరీక్షల ఫలితాలు, క్రమశిక్షణ మరియు భవిష్యత్ కెరీర్ అవకాశాల, కళాశాల అభివృద్ధి గురించి ప్రిన్సిపల్ విద్యార్థుల తల్లిదండ్రులతో సుదీర్ఘంగా చర్చించారు. అధ్యాపకులు నాగేంద్ర ,డాక్టర్ సతీష్,కుమార్ రాజా,మసూద్,రాజా రెడ్డి,బాబు రవిచంద్ర,పీడీ తేజేంద్ర,ప్రసాద్,వినోద్ అధ్యాపక బృందం బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

# ఉరవకొండలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**ఉరవకొండ మన జనప్రగతి ఆగస్టు 07: -**అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శుక్రవారం ఉరవకొండ మండల కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత పాత తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో జరుగుతున్న నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు.అనంతరం రెవెన్యూ రికార్డు రూమ్‌ను తనిఖీ చేసి అసైన్డ్ భూములకు సంబంధించిన ఫైల్స్, స్కెచ్‌లు, భూ సర్వే డైలాట్ తదితర ధ్రువీకరణ పత్రాలను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియను పరిశీలించి, సంబంధిత వివరాలన్నింటినీ తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు.తర్వాత మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ అంశాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో జనగణన (సెన్సెస్) క్షేత్రస్థాయి పనులు, నిర్దేశిత కాలక్రమంపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అరుణ, ఎంపీడీవో బి.వి. రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జైల్‌భరో

● కార్మికులు,రైతులు,ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలి

● రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ



**పత్తికొండ మన జనప్రగతి ఆగస్టు 07:**కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10న నిర్వహించే జైల్‌భరో, నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. పత్తికొండలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయనతో పాటు సీపీఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర పాల్గొని మాట్లాడారు.కార్మికులు శ్రమించి దేశ సంపదను సృష్టిస్తున్నప్పటికీ వారికి తగిన వేతనాలు, హక్కులు దక్కడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.31 వేలు అమలు చేయాలని, లేబర్ కోడ్లను రద్దు చేయాలని, పర్మినెంట్ పనుల్లో ఉన్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. అన్ని పంటలకు ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా కలిపి మద్దతు ధర ప్రకటించాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, పంట రుణాలు అందించాలని కోరారు. కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతుల రుణమాఫీ చేసి ఉచిత పంటల బీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి 200 రోజుల పని కల్పించాలని, రోజుకు రూ.700 వేతనం ఇవ్వాలని, పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర ధరల పెరుగుదలను నియంత్రించాలని డిమాండ్ చేశారు.కర్నూలు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతుల రూ.2 లక్షల వరకు బ్యాంకు రుణాలు మాఫీ చేయాలని, వేదవతి, గుండ్రేవుల రిజర్వాయర్లను పూర్తి చేసి హంద్రీనీవా ద్వారా సాగునీరు అందించాలని కోరారు.కార్మికులు, రైతులు, ప్రజల హక్కుల కోసం జరిగే ఆగస్టు 10 జైల్‌భరో కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి కేంద్ర ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేయాలని నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు మధు, రాజుల కారప్ప, సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# పోలవరంపై కేంద్ర ప్రభుత్వ మోస పూరిత వైఖరి తగదు

**వైసీపీ నిరాహార దీక్ష శిబిరంపై టిడిపి ఎమ్మెల్యే దాడి తగదు: మాజీ ఎంపీ తులసి రెడ్డి**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 07:-**రాష్ట్రానికి వరప్రసాదిని, బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం లోని మోడీ ప్రభుత్వం మోసం చేస్తున్నదని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజ మెత్తారు. వేంపల్లి లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బచావత్ ట్రిబ్యునల్ అవార్డు, కేంద్ర జల సంఘం,విభజన చట్టం పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45. 72 మీటర్లుగా అనగా 150 అడుగులుగా నిర్ణయించి అనుమతించాయన్నారు .అంత ఎత్తులో నిర్మిస్తేనే 194.60 టీఎంసీల నీరు నిల్వ ఉంటుందని,అంత ఎత్తులో నిర్మించి నీటి నిల్వ చేయాలంటే ప్రస్తుత అంచనాల ప్రకారం రూ 62,436 కోట్ల రూపాయలు కావాల్సి ఉందన్నారు.అంత ఎత్తులో నిర్మించి నీరు నిల్వ చేస్తేనే పోలవరం ప్రాజెక్ట్ బహుళార్థ సాధక ప్రాజెక్టు అనిపించుకుంటుందన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా విశాఖ,తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి కృష్ణాజిల్లాల్లో 7.20 లక్షల ఎకరాలలో కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించాలన్నా,తూర్పుగోదావరి,పశ్చిమగోదావరి జిల్లాల్లో 10.13 లక్షల ఎకరాలు స్థిరీకరణ చేయాలన్నా, 540 గ్రామాలలో 28.5 లక్షల మందికి త్రాగునీరు అందించాలన్నా, విశాఖపట్నంకి త్రాగునీరు, విశాఖ ఉక్కు కర్మగారానికి నీరు అందించాలన్నా, 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి చేయాలన్నా, కుడికాలువ ద్వారా గోదావరి కృష్ణా నదుల అనుసంధానం చేసి 80 టీఎంసీలు గోదావరి జిల్లాలు కృష్ణా డెల్టాకు మళ్లించాలన్నా పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్లు అనగా 150అడుగుల ఎత్తులో నిర్మించి నీరు నిల్వ చేస్తేనే సాధ్యమవుతుందన్నారు .అప్పుడే అది గ్రావిటీ ప్రాజెక్టు అవుతుందని, అంతే తప్ప 41.15 మీటర్లు ఎత్తు అంటే 135అడుగుల ఎత్తు వరకే నిర్మించి నీరు నిలువ చేస్తే 119 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంటుందని, పై లక్ష్యాలు నెరవేరవని, కేవలం ఎత్తిపోతల ప్రాజెక్టుగా తయారవుతుందన్నారు.పోలవరం ప్రాజెక్టుకు 41.15 మీటర్ల ఎత్తు వరకే నీరు నిలువ చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని శుక్రవారం లోకసభలో కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారన్నారు. 45.72 మీటర్ల ఎత్తులో పూర్తిస్థాయిలో నిర్మించి నీటి నీరు నిల్వ చేయాలంటే అదనంగా రూ 32 వేల కోట్ల రూపాయలు భూసేకరణకు,పునరావాసానికి కావలసి ఉంటుందన్నారు.ఈ ఆర్థిక భారాన్ని తగ్గించుకునే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం మొదటి దశ అంటూ 41. 15 మీటర్ల ఎత్తు వరకే ఆమోదం తెలిపిందన్నారు .బచావత్ ట్రిబ్యునల్,విభజన చట్టం, కేంద్ర జల సంఘం అనుమతి ప్రకారంగా 45.72 మీటర్ల ఎత్తు వరకు నిర్మించి నీటిని నిల్వ చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం,మిగతా ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభుత్వంపై పోలవరం అంశంపై తేవాలని ఆయన విన్నవించారు.

# చేనేత వస్త్రాలను ఆదరిద్దాం.. నేతన్నలకు అండగా నిలుద్దాం

**- రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ**



**దేవనకొండ మన జనప్రగతి ఆగస్టు 07: -**జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆలూరు నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బుజ్జమ్మ శుభాకాంక్షలు తెలిపారు. చేనేత వస్త్రాలను ధరించి నేతన్నల నైపుణ్యాన్ని, శ్రమను గౌరవించాలని ఆమె పిలుపునిచ్చారు.ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు చేనేత రంగాన్ని ప్రోత్సహించి నేతన్నల భవిష్యత్తుకు అండగా నిలవాలని కోరారు. చేనేత కార్మికుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు

**- పులివెందుల ట్రాఫిక్ సీఐ జి.ప్రసాద్ రావు**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి ఆగస్టు 07:**కడప జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా,జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మరియు పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ పర్యవేక్షణలో పులివెందుల పట్టణంలో విస్తృత ట్రాఫిక్ తనిఖీలు నిర్వహించడం జరిగిందని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ రావ్ తెలిపారు.పట్టణంలోని రద్దీ ప్రాంతమైన పూలంగళ్ల సర్కిల్ వద్ద శుక్రవారం ప్రత్యేక తనిఖీ డ్రైవ్ చేపట్టారు.హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడపడం,వాహనాలకు సంబంధించిన డ్రైవింగ్ లైసెన్స్,ఆర్‌సి, ఇన్సూరెన్స్ వంటి సరైన పత్రాలు లేకపోవడం,ఇతర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన పలువురు వాహనదారులను గుర్తించి వారికి జరిమానాలు విధించడం జరిగింది.ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని రహదారులపై నిర్లక్ష్యంగా వాహనాలు నడిపితే అమూల్యమైన ప్రాణాలు గాల్లో కలసిపోయే ప్రమాదం ఉందన్నారు.రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు,ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు. వాహనదారులు తమ వెంట అవసరమైన అన్ని పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.ఈ విధమైన ప్రత్యేక తనిఖీలు పులివెందుల పట్టణంతో పాటు దాని పరిసర ప్రాంతాల్లో నిరంతరం కొనసాగుతాయని నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప రమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు పోలీసులకు సహకరించి,సురక్షిత ప్రయాణం సాగించాలని కోరారు.

# పొన్నమండ లక్షణ స్వామి వర్మ జయంతి వేడుకలు

**మదనపల్లె, మన జనప్రగతి, ఆగస్టు 07:-** శ్రీ పొన్నమండ లక్షణ స్వామి వర్మ జయంతి వేడుకలను అన్నమయ్య జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధికారి పి. తేజస్విని అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా పొన్నమండ లక్షణ స్వామి వర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తేజస్విని మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం, విద్యా ప్రగతి, సమాన అవకాశాల కోసం పొన్నమండ లక్షణ స్వామి వర్మ చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సమాజంలో ఐక్యత, స్వాభిమానం, విద్యాభివృద్ధికి ఆయన అందించిన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాయలసీమ అగ్నివన్నెకుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు ఎ. బలరాం, ట్రెజరర్ కె. గోపికృష్ణ, తంబళ్లపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు జయరాం, పీలేరు మండల అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షురాలు ఆర్. ఇందుమతి, జిల్లా సంఘ నాయకులు, ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేతన్నలకు అండగా కూటమి ప్రభుత్వం

**- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్**



**వేంపల్లె, మన జనప్రగతి, ఆగస్టు 07:-** రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం వేంపల్లెలో ఆయన మాట్లాడుతూ జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రతి అర్హత కలిగిన చేనేత కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.రూ.179 కోట్లతో రాష్ట్రంలోని 71,536 చేనేత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించడం ద్వారా నేతన్నలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు, పవర్‌లూమ్ యూనిట్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు.చేనేత కార్మికుల జీవనోపాధికి మరింత భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవి యాదవ్, ఎస్సీ మోర్చా సీనియర్ నాయకుడు ముద్ది శివకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి

08- 08 - 2026

# కూటమి ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం

**- ఇంటింటా ప్రచారంలో టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి తదితరులు**





**ఓబులవారిపల్లి మన జన ప్రగతి ఆగస్టు 07:–** ఆంధ్రప్రదే లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ప్రజా సంక్షేమం అంచలంచలుగా అభివృద్ధి చెందిందని రైల్వే కోడూరు టిడిపి ఇన్చార్జి కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి కుమారుడు యువ నాయకుడు ముక్క సాయి వికాస్ రెడ్డి అన్నారు, శుక్రవారం తిరుపతి జిల్లా ఓబులవారిపల్లి మండలం బోటు మీద పల్లి కాకర్ల వారి పల్లి మంగళంపల్లి తదితర పంచాయతీలలో ఆయన కూటమి నాయకులు కార్యకర్తలతో కలిసి ప్రజా సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం అనే ఆయుధముతో ఇంటింటా ప్రచారం నిర్వహించి. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా ప్రజా పాలన ఎలా ఉంది ప్రజా అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు అందే విధంగా నాయకులతో సమావేశమై ఎక్కడ ఎటువంటి ఇబ్బంది లేకుండా కార్యకర్తలు ఇబ్బందులు గురి కాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వారు తెలిపారు ప్రజల వద్దకే పాలన ప్రజా సంక్షేమం ప్రజాభివృద్ధి ధ్యేయంగా మన కూటమి ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి లోకేష్ సారథ్యంలో రాష్ట్రం ముందుకు అభివృద్ధిలో సాగుతుందని ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే సంబంధిత అధికారులతో సమావేశమై అలాగే నాయకులతో సమావేశమై వారి సమస్యలను వెంటనే పరిష్కరించుకోవాలన్నారు అంతే కాకుండా అన్ని గ్రామాలలోనూ యువ నాయకుడికి ఘనంగా గజమాలతో శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు పలువురు గ్రామాల సమస్యలను నాయకులకు తెలియజేశారు వారి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని సానుకూలంగా స్పందించి భరోసా ఇచ్చారు ఈ కార్యక్రమంలో అన్ని గ్రామ పంచాయతీల కూటమి నాయకులు నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రతిరైతు ఎలినినో ప్రభావ నివారణ కార్యాచరణలో పాల్గొనాలి

**- మండల వ్యవసాయ అధికారి అంగోత్ రమేష్**



**లింగాల మన జనప్రగతి ఆగస్టు 07:–**2026 ఖరీఫ్ సీజన్లో నెలకొన్న ఎల్నినో పరిస్థితుల దృష్ట్యా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ రాష్ట్రవ్యాప్తంగా "రైతన్నా మీకోసం ఎల్నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక" పేరుతో సమగ్ర క్షేత్రస్థాయి ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని అమలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. అందులో భాగంగా పెద్దకూడాల రైతు సేవా కేంద్ర గ్రామాలలో జరుగుతున్న ఎల్నినో ప్రభావ నివారణ కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రమేష్ పాల్గొన్నారు. ఏవో మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలోని ప్రతి రైతును, ప్రతి వ్యవసాయ భూకమతమును 100 శాతం సందర్శించుటం, పంట ప్రస్తుత పరిస్థితి, నీటి కొరత వలన పంట వాడిపోవడం లేదా ఎండిపోవడం, చీడపీడల ఉధృతి, ఉద్యాన పంటల పరిస్థితి, బీడు లేదా సాగు చేయని భూముల వివరాలు వంటి అంశాలను అంచనా వేయడం,క్షేత్రస్థాయిలో గుర్తించిన కరువు పరిస్థితులకు తగు విధంగా నివారణ చర్యలు, పంటను కాపాడుకునేందుకు తక్షణమే ఇవ్వవలసిన ప్రాణాధార నీటి తడులు, మల్చింగ్ ద్వారా తేమ సంరక్షణ చర్యలు, విత్తన గుతికలు, ప్రతికూల వాతావరణ మార్పులకు అనుగుణంగా వేసుకోవాల్సిన ప్రత్యామ్నాయ పంటలు, అంతర పంటల సాగు, పంట నిర్వహణ వంటి పరిష్కార చర్యలు సూచించడం. బీడుగా ఉన్న, సాగు చేపట్టని పొలాల్లో స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలు వేయడం లేదా వర్షాభావ పరిస్థితి పరిణామాల వలన తీవ్రంగా దెబ్బతిన్న భూములలో మరలా స్వల్పకాలిక రకాలను విత్తుకునే విధంగా ప్రోత్సహించడం, పర్యవేక్షించడం మరియు ఫార్మర్ యాప్ ద్వారా రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతి లో వేసిన పిడిఎంఎస్ క్షేత్ర సందర్శన,ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అత్యంత అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది యువ తేజ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం: మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి

**లక్కిరెడ్డిపల్లి మన జనప్రగతి ఆగస్టు 07:–**కూటమి ప్రభుత్వంలోని భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం జరుగుతుందని మంత్రి సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. శనివారం నాడు లక్కిరెడ్డిపల్లి మండలఓ దిన్నెపాడు గ్రామం లో జరిగినటువంటి గ్రామసభ లో నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మండల తహసీల్దార్ క్రాంతి కుమార్ మరియు మండలాధ్యక్షుడు యనమల మదమోహన్ తో కలిసి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేస్తుందని కూటమి ప్రభుత్వంలో శాశ్విత భూ సమస్యలకు పరిష్కారం జరుగుతుందని గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలకు తావలేకుండా కూటమి ప్రభుత్వంలో అత్యాధునిక సాంకేతికత ఉపయోగించి భూ వివాదాలకు పరిష్కారం చూపుతున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా రెవెన్యూ సిబ్బంది పనిచేస్తుందని రీ సర్వే పూర్తయిన ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహిస్తున్నామని కావున ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నూతన పట్టాదారు పాసు పుస్తకాలలో ఏవైనా తప్పిదాలు ఉంటే వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బందితోపాటు, క్లస్టర్ కన్వీనర్ శంకారపు జయరాం, లక్కిరెడ్డిపల్లి సింగిల్ విండో అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ రాజు, చెరువు చైర్మన్ మోహన్ రెడ్డి, ధర్మరాజు,సర్పంచ్ రవిరాజు గ్రామ అధ్యక్షుడు ఓబులేసు, సంజీవ రాజు, సుబ్బరాజు, పీరయ్య టిడిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం


**• పులివెందుల డి.డి.ఓ వెంకటసుబ్బయ్య**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 07:–**తల్లి పాలే బిడ్డలకు అమృతం లాంటివని, తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి అధికారి, వేంపల్లి గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి గౌతుకట్ల వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగావేంపల్లి లోని వైయస్సార్ సభా భవనంలో వేంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సునీత నేతృత్వంలో ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాల ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ సృష్టిలోనే తల్లిపాలకు ప్రత్యామ్నాయం లేదన్నారు. సుస్థిర జీవితానికి తల్లిపాలే శ్రేష్టమైనవి అన్నారు.వేంపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ వి .సునీత మాట్లాడుతూ నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే 2023–24 విడుదల చేసిన గణాంకాల ప్రకారం గంటలోపు తల్లిపాలు పట్టిస్తున్న శాతం 52.0 శాతం నుంచి 67.2 శాతం వరకు అనగా12 శాతం పెరిగిందన్నారు ,అలాగే బిడ్డకు ఆరు నెలల వరకు కేవలం తల్లి పాలు తాగిస్తున్న శాతం 68 నుండి 69.5 శాతం పెరిగిందని ఇది కేవలం 1.5 శాతం మాత్రమే పెరిగిందని,6 నెలల నుంచి 8 నెలల లోపు పిల్లలకు తల్లిపాలతో పాటు అనుబంధ పోషకాహారం ఇస్తున్న వారి శాతం 50.8 శాతం నుంచి 72 శాతం కు పెరిగిందని,దాదాపు గా 22 శాతం పెరిగిందని ఈ మూడు ఇండికేటర్స్ లో ఏ ఒక్క ఇండికేటర్ కూడా 75 శాతం కూడా దాటలేదన్నారు. అందువల్ల అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో తల్లిపాల ప్రాముఖ్యతను తెలియ చేసి తల్లులలో అవగాహన పెంచాలని తెలిపారు.మెడికల్ ఆఫీసర్ ఎల్.పూర్వజ మాట్లాడుతూ..తల్లి నుంచి మొదటగా వచ్చే పాలను ముర్రుపాలు అంటారని, ఈ పాలలో రోగనిరోధక శక్తిని కల్పించే యాంటీ బాడీస్ ఉంటాయని అందువల్ల బిడ్డ జన్మించిన వెంటనే ఇన్ఫెక్షన్స్ రాకుండా ఈ పాలను తాగించాలని కోరారు.సిహెచ్ఓ వెంకట రత్నం ,అర్చన దేవి హెల్త్ సూపర్వైజర్, తులసమ్మ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు డాక్టర్ స్వర్ణలత, సుభద్ర, అసీన, శ్రావణీ, భారతీ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ నేత మల్లాది వొరగబెట్టిందేమీ లేదు


**- రాష్ట్ర బ్రాహ్మణ హక్కుల చైతన్య వేదిక నేతలు**



**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు07:–** మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఎన్నో ఏళ్లుగా బ్రాహ్మణ సంఘం నాయకుడి గా శాసన సభ్యులు గా ఉండి రాష్ట్రము లో బ్రాహ్మణుల కు చేసిన మేలు ఏమీ లేదని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు సూగురు రఘునాథ రావు పీవీయెస్వి ప్రసాదరావు లు పేర్కొన్నారు. వేంపల్లి లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు.గత ప్రభుత్వ హయాంలో మల్లాది బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ గా ఉండి కార్పొరేషన్ పథకాలను అట కెక్కించి బ్రాహ్మణుల కు తీవ్ర మైన అన్యాయం చేసింది మీరు కాదా అని వారు మల్లాది విష్ణును ప్రశ్నించారు. ప్రశ్నించారు. కార్పొరేషన్ ను బిసి శాఖ లో కలిపితే అప్పట్లో ఆయన నోరు మెదప లేక పోయారని ప్రశ్నించారు.నిబంధనలకు వ్యతిరేకం గా ధర్నా చేయరాని చోట ధర్నా చేస్తే పోలీసులు చర్యలు తీసుకోరా అని వారు పేర్కొన్నారు. రాష్ట్రము లో అప్పట్లో అర్చకుల పై దాడులు జరిగితే మల్లాది ఖండించలేదని ఆరోపించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం లోమీ బార్ లో కల్తీ మద్యం అవకతవకలు జరిగితే అరెస్ట్ చేయలేదా అంతకంటే నేటి సంఘటన అవమానమా అని ప్రశ్నించారు. డీఎస్సి లో అవకతవకలు జరగక పోయిన లేని విషయాలకు నడి రోడ్డు లో పోలీస్ అనుమతి లేకుండా ధర్నా చేయడం తప్పు కాదా అని ప్రశ్నించారు. ధర్నా చౌక్ లో ధర్నా చేస్తే అరెస్ట్ చేయరని అధినేత దృష్టికి పోదనే అనవసర చర్చ చర్చ కోసమే ఇదంతా చేశారని వారు పేర్కొన్నారు . మల్లాది బ్రాహ్మణ సామాజిక వర్గ సహేతుకమైన సమస్య లపై ధర్నా చేస్తే బ్రాహ్మణ నాయకుడి గా గుర్తిస్తామని ఇటువంటి సంఘటన లు వ్యక్తిగత ఇమేజ్ కు ఉపయోగపడతాయే తప్ప బ్రాహ్మణ సమాజానికి ఉపయోగ పడవని వారు స్పష్టం చేశారు.

# రైల్వే కోడూరులో గంజాయిపై పోలీసుల ప్రత్యేక తనిఖీలు

**- 210 మందికి డ్రగ్ టెస్ట్‌లు.**



**రైల్వే కోడూరు మన జనప్రగతి ఆగస్టు 07:–**తిరుపతి జిల్లా రైల్వే కోడూరు, పోలీసు యంత్రాంగం గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు, రేణిగుంట డీఎస్పీ వై. శ్రీనివాసరావు పర్యవేక్షణలో, రైల్వే కోడూరు సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే కోడూరు పట్టణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. చిట్వేల్ రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో గంజాయి టెస్ట్ కిట్లతో మొత్తం 210 మందికి పరీక్షలు నిర్వహించారు. గంజాయి వినియోగం, విక్రయం, సరఫరాపై సమాచారాన్ని సేకరించేందుకు పోలీసు సమాచారదారుల వ్యవస్థను మరింత బలోపేతం చేసినట్లు అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరాదారులు, విక్రయదారులు, వినియోగదారుల కదలికలపై నిరంతరం నిఘా కొనసాగుతున్నట్లు వెల్లడించారు.గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు పోలీసులకు అందించాలని, సమాచా రం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అధికారులు భరోసా ఇచ్చారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ, వాటి దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు.గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్ర యం, సరఫరాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

# ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి




**బనగానపల్లె, మన జనప్రగతి, ఆగస్టు 07:–** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు క్షేత్రస్థాయిలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సూచించారు. శుక్రవారం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన అర్జీల స్వీకరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజల నుంచి ఆయన స్వయంగా వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను మంత్రికి వివరించారు. వాటిని సావధానంగా విన్న మంత్రి, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడారు. న్యాయబద్ధమైన సమస్యలపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. మిగిలిన సమస్యలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధితో కూడిన సుపరిపాలనకు ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు.ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని బాధ్యతగా పరిశీలించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అర్జీల స్వీకరణ సందర్భంగా మంత్రి స్పందించిన తీరుపై పలువురు బాధితులు హర్షం వ్యక్తం చేశారు.మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాలకు చెందిన ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

# ఆటల్లో గెలుపోటములు సహజం.. క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలి: మంత్రి కందుల దుర్గేష్




**రాజమహేంద్రవరం, మన జనప్రగతి, ఆగస్టు 07:–** విద్యార్థుల సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి చదువుతో పాటు క్రీడలు, పాఠ్యేతర అంశాలు ఎంతో దోహదపడతాయని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరంలోని శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న సీబీఎస్ఈ సౌత్ జోన్–1 గర్ల్స్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్–2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారిణులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మేరీ కోమ్, పీవీ సింధు, బాలాదేవి వంటి క్రీడాకారిణులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి మహిళా శక్తిని చాటారని కొనియాడారు. మహిళలకు సరైన అవకాశాలు కల్పిస్తే అన్ని రంగాల్లోనూ సత్తా చాటుతారని అన్నారు. ఫుట్‌బాల్‌కు శారీరక దారుఢ్యంతో పాటు జట్టు స్ఫూర్తి ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఆగస్టు 6 నుంచి 8 వరకు నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 51 జట్లు పాల్గొంటుండటం విశేషమన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని క్రీడాకారిణులకు సూచించారు. క్రీడల ద్వారా పెంపొందే ఆత్మవిశ్వాసం జీవితంలోనూ విజయాలను అందిస్తుందని తెలిపారు.తమిళనాడు నుంచి వచ్చిన క్రీడాకారిణులను ఉద్దేశించి మంత్రి తమిళంలో ప్రసంగించి ఆకట్టుకున్నారు. పోటీల్లో పాల్గొంటున్న క్రీడాకారిణులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా శ్రీ పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుక

**కడప,మన జనప్రగతి ఆగస్టు 07:–** శుక్రవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో.. జిల్లా బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీ పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ జయంతి వేడుక ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి కె. మల్లికార్జునుడు లక్ష్మణ స్వామి వర్మ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ అధికారులు, బిసి సంఘ నేతలు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మన జనప్రగతి

08- 08 - 2026

# ఆరు తలల షణ్ముఖుడి సన్నిధిలో ఆధ్యాత్మిక వైభవం

### శ్రీ రామాపురంలో మార్మోగిన 'హరోహర' నినాదాలు

### వైభవంగా ఆడికృత్తిక పూజలు

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి ఆగస్టు 07:**–వైఎస్సార్ కడప జిల్లా కమలాపురం మండలం శ్రీ రామాపురం మహా పుణ్యక్షేత్రంలో శుక్రవారం ఆడికృత్తిక మహోత్సవాలు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీ వల్లి దేవసేన సమేత షణ్ముఖ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక అలంకరణ, కలశ స్థాపన, క్షీరాభిషేకం, కావడి సేవ, కాలసర్ప హోమం తదితర విశేష పూజలను ఆలయ నిర్వాహకులు, పుణ్యభూమి చారు ట్రస్ట్ సభ్యులు ఘనంగా నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారిని నెమలి వాహనంపై ఆలయ ప్రాంగణంలో ఊరేగించగా, భక్తులు "హరోహర మహాదేవ", "మురుగా మురుగా" నినాదాలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. కమలాపురం మండలంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు





నిర్వహించారు. అరుదైన **షణ్ముఖ రూపమే క్షేత్ర ప్రత్యేకత** శ్రీ రామాపురం క్షేత్రంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారు ఆరు తలలతో అరుదైన షణ్ముఖ రూపంలో కొలువుదీరి ఉండటం ఈ ఆలయానికి ప్రధాన విశిష్టతగా భక్తులు పేర్కొంటున్నారు. ఈ దివ్యరూప దర్శనం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుంటారు.**క్షీరాభిషేకంలో నీలి వర్ణం.. భక్తుల విశ్వాసం** స్వామివారికి క్షీరాభిషేకం చేసే సమయంలో ఆవుపాలు విగ్రహంపై పడగానే స్వామివారి రూపం నీలి వర్ణంలోకి మారడం ఈ క్షేత్రంలోని విశేషంగా భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ అరుదైన దృశ్యాన్ని తిలకించేందుకు ప్రతి ఆడికృత్తిక సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు విచ్చేస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. **దోష నివారణ క్షేత్రంగా ప్రసిద్ధి** శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సకల దోషాలను నివారించే దైవంగా భక్తులు ఆరాధిస్తారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహిస్తే కుటుంబంలో శుభఫలితాలు, సౌభాగ్యం కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ క్షేత్రంలో సుమారు 1,500 సంవత్సరాలుగా స్వామివారు కొలువై ఉన్నారని పురాణాలు, పండితులు పేర్కొంటున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆడికృత్తిక మహోత్సవాల్లో పుణ్యభూమి చారు ట్రస్ట్ సభ్యులు, ఆలయ నిర్వాహకులు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కిక్కిరిసిపోయింది.

# ప్రతి విభాగము కీలకమే..: వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



**కడప మన జనప్రగతి ఆగస్టు 07:**–విశ్వవిద్యాలయంలో ప్రతి విభాగం క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహించిప్పుడే న్యాక్ లో అనుకున్న గ్రేడు సొంతం చేసుకోగలుగుతామని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్ లో తొలిసారిగా వైవీయూలోని అన్ని సెల్ ల డైరెక్టర్లు, సమన్వయకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ అకడమిక్ రీసెర్చ్ తరువాత అదనపు విభాగాలు సమర్థవంతంగా పనిచేస్తే విద్యార్థులకు బోధన పరిశోధనతో పాటు,ఉత్తమ సేవలు అందుతాయని,సంపూర్ణమైన ఆలోచనలు గల విద్యార్థులు తయారు అవుతారని తెలిపారు. ప్రపంచం మారుతుంది మార్కెట్ అవసరాలకు తగ్గట్టు అకడమిక్ రీసెర్చ్ లో విద్యార్థులను ప్రావీణ్యం పెంచాలన్నారు.ప్రధానంగా పూర్వ విద్యార్థుల (అలుమ్ని) సెల్ ను బలోపేతం చేయడానికి ప్రతి ప్రొఫెసర్లు సహకారం అందించాలని సూచించారు. పూర్వ విద్యార్థులంతా సభ్యులయ్యేలా చూడాలన్నారు. ప్లేస్ మెంట్ సెల్ వల్ల వైవీయూలో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందన్నారు.హెల్త్ అవేర్నెస్ కార్యక్రమాలు ప్రతి నెల నిర్వహించాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మేధోపరమైన ఉపన్యాసాలు పెరగాల్సి ఉందన్నారు. కొత్తగా పేటెంట్ సెల్ ఏర్పాటు చేస్తామన్నారు. ఈక్వల్ ఆపర్చునిటీ సెల్, ఉమెన్ సెల్, మైనార్టీ సెల్ తదితర విభాగాలపై సమీక్షించి సూచనలు చేశారు. ప్రిన్సిపల్ ప్రొ టి శ్రీనివాస్,పీఎం ఉష సమన్వయకర్త ప్రొ టి చంద్రశేఖర్,వివిధ సెల్ల డైరెక్టర్లు ప్రొఫెసర్లు విజయభారతి,కేఎస్వి కృష్ణారావు,ఎన్. వెంకట్రామిరెడ్డి,రియాజున్నీసా, ఎం.ఎం.వినోదిని,కె.లలిత, వసుగోవర్ధన్ రెడ్డి,వి.సునీత,సునీత,అను ప్రసన్న,జి.పార్వతి,డా.టి.సురేశ్ బాబు పాల్గొన్నారు.

# అన్నమయ్య,కడప జిల్లాల యండిపిఎస్ నూతన కమిటీల ఎంపిక

### అన్నమయ్య,కడప జిల్లాల రాష్ట్ర అధికార ప్రతినిధి సి.వి రమణ

**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి ఆగస్ట 07:**–అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని యండిపిఎస్ రాయలసీమ కార్యాలయంలో యండిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అధికార ప్రతినిధి సివి రమణ ఆధ్వర్యంలోని రాష్ట్ర కమిటీ అన్నమయ్య, కడప జిల్లాల నూతన కమిటీలో అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా పెద్దపల్లి అశోక్ కుమార్,కడప జిల్లా అధ్యక్షులు సుందుపల్లి ఓబులేష్ ను నియమించడం జరిగింది.ఈ సందర్భంగా యండిపిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సివి. రమణ నూతన కమిటీ సభ్యులను మాదిగ దళ పోరాట సమితి(యండిపిఎస్)లోకి ఆహ్వానించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాదిగ దళ పోరాట సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి సివి రమణ మాట్లాడుతూ యండిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పెద్దపల్లి శేఖర్ ఆదేశాల అనుసారం మాదిగ దళ పోరాట సమితి సిద్ధాంతాలకు అనుగుణంగా మాదిగల అభివృద్దే ప్రధాన లక్ష్యంగా మాదిగ జాతి అభ్యున్నతి కోసం పాటుపడుతూ మాదిగ జాతి బిడ్డలకు జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ఏ సమస్య వచ్చినా మీరు ముందుండి



మన జాతి బిడ్డల సమస్యల పరిష్కారం దిశగా పనిచేస్తూ వారి వెన్నంటే ఉండాలని మనమందరం కలిసికట్టుగా మన జాతి బిడ్డల సమస్యలపై న్యాయం జరిగే పోరాడాలని అదేవిధంగా మీరు అనునిత్యం మన మాదిగ గ్రామాలలో పర్యటిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ఆ సమస్యలను పరిష్కరిస్తూ మన జాతి బిడ్డలలో చైతన్యం నింపుతూ వారికి యండిపిఎస్ పై అవగాహన కల్పిస్తూ మాదిగ దళ పోరాట సమితి (యండిపిఎస్)ను బలోపేతం చేయడం కోసం కృషి చేయాలని నూతన కమిటీ సభ్యులకు దిశా నిర్దేశం చేశారు. **అన్నమయ్య జిల్లా కమిటీ.**జిల్లా అధ్యక్షులు పెద్దపల్లి అశోక్ కుమార్, జిల్లా ఇన్చార్జి వేణుగోపాల్,జిల్లా ఉపాధ్యక్షులు ఎస్వీ రమణ, జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్దన్న, జిల్లా అధికార ప్రతినిధి పుష్పరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుమల, జిల్లా కార్యదర్శి సుబ్రహ్మణ్యం,జిల్లా ప్రచార కార్యదర్శి తేజ సాయి, జిల్లా కోఆర్డినేటర్ అమృతపురి అశోక్,జిల్లా సలహాదారులు నాగయ్య,జిల్లా అబ్జర్వర్ వీరాంజనేయులు. **కడప జిల్లా కమిటీ..** జిల్లా అధ్యక్షులు సుందుపల్లి ఓబులేష్,జిల్లా ఇన్చార్జ్ మంద నాగార్జున,జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, జిల్లా గౌరవ అధ్యక్షులు మధుసూదన్ రావు,జిల్లా అధికార ప్రతినిధి రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగార్జున,జిల్లా కార్యదర్శి నాగరాజు,జిల్లా ప్రచార కార్యదర్శి మూర్తి, జిల్లా కోఆర్డినేటర్ ఆంజనేయులు, జిల్లా సలహాదారుల ఓబులేసు,నాగభూషణం, వెంకటేశ్వర్లు,శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# సింగపూర్ ఎస్టీఎం టౌన్‌షిప్‌కు నూతన కార్యవర్గం ఎన్నిక

### - పారదర్శక పాలనతో అభివృద్ధికి కృషి చేస్తామని కమిటీ హామీ



**కడప మన జనప్రగతి ఆగస్టు 07:**–కడప నగరంలోని సింగపూర్ ఎస్టీఎం టౌన్‌షిప్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీకి నూతన కార్యవర్గం ఎన్నికైంది. సింగపూర్ నమూనాలో నిర్మించిన ఈ టౌన్‌షిప్‌లో 450 మందికి పైగా నివాసితులు ఉన్నారు.నివాసితుల సమస్యల పరిష్కారం, టౌన్‌షిప్ అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ చట్టం1995 ప్రకారం సొసైటీని ఏర్పాటు చేశారు. గతంలో నిర్వహణలో ఎదురైన ఇబ్బందులకు పరిష్కారంగా 15 మంది సభ్యులతో పాలక మండలిని ఏర్పాటు చేశారు.సొసైటీ కన్వీనర్ డి. రవికుమార్ మాట్లాడుతూ టౌన్‌షిప్ పరిపాలనలో ఇది కొత్త అధ్యాయమని, పారదర్శక పాలనతో నివాసితులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.శుభ్రత, తాగునీరు, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ, పార్కులు, కమ్యూనిటీ హాల్, సీసీ కెమెరాలు, భద్రత వంటి సౌకర్యాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.**నూతన కార్యవర్గం..**అధ్యక్షుడిగా డాక్టర్ టి. సుబ్బారెడ్డి, అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఎస్. వేణుగోపాల్ రెడ్డి, జనరల్ సెక్రటరీగా డి. రవికుమార్, ట్రెజరర్‌గా డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్లుగా కె.వి. నరసింహ ప్రసాద్, యూనస్ అలీ, సి. రమాదేవి, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.ఈ నెల 9వ తేదీన ఎన్నికల నిర్వహణకు సంబంధించి నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ టి. సుబ్బారెడ్డి తెలిపారు.

# ట్రిపుల్ ఐటీల్లో ముగిసిన ప్రవేశాలు.

### ఇడుపులపాయలో 105 మంది విద్యార్థులకు ప్రవేశాలు.

### 5 విడతల్లో 4380 సీట్ల భర్తీ.

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 07:**–రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జియూకేటి ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు,ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో 2026–27 విద్యా సంవత్సరానికి గాను ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్స్ కోసం ఇడుపులపాయలో శుక్రవారం నిర్వహించిన తుది విడత కౌన్సిలింగ్లో అధికారులు 105 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. ఇప్పటివరకు 5 విడుదలగా నిర్వహించిన కౌన్సిలింగ్లో నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 4 , 380 సీట్లను భర్తీ చేశారు. ఒక్కోటి ట్రిపుల్ ఐటీ లో 1100 సీట్లు చొప్పున 4400 సీట్లు ఉన్నాయి. చివరగా ఇక కేవలం క్రీడల కోటా కింద నాలుగు ఐటీల్లో 20 సీట్లు మాత్రమే పెండింగ్లో ఉన్నాయి. ఇక్కడి కేంద్ర గ్రంథాలయంలో డైరెక్టర్ ఆచార్య గడ్డం విజయప్రకాష్ నేతృత్వంలో అధికారులు కౌన్సిలింగ్ నిర్వహించారు. తుది విడత ఈ కౌన్సిలింగ్కు ఇడుపులపాయ నూజివీడు ఒంగోలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ లకు ఎంపికైన 105 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. క్రీడా శాఖ నుంచి అర్హులైన విద్యార్థులు జాబితా అందకపోవడం వల్ల నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ఆ కోట కింద 20 సీట్లు మాత్రమే భర్తీ చేయాల్సి ఉంది. ఆ విద్యార్థుల జాబితా అందిన వెంటనే ఆ 20 సీట్లు కూడా భర్తీ చేస్తామని



వర్సిటీ అధికారులు ప్రకటించారు.కార్యక్రమంలో పరిపాలనాధికారి రవి కుమార్,డీన్ అకాడమిక్స్ రమేశ్ కైలాష్,డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ వెంకటేష్ అసోసియేట్ డీన్స్ రాఘవ రెడ్డి, నవీన్, ఉదయశ్రీ, హుస్సేన్, తిలక్,చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శరవణ కుమార్,సాఫ్ట్వేర్ ఇంజనీర్ లింగమూర్తి, జ్ఞానవెంకట్,ఐటీ ఇన్ఫ్రా కోఆర్డినేటర్ సంతోష్, అధ్యాపకులు ఓబయ్య, కొనప్ప, రాము, సురేంద్ర, పెద్దన్న, కార్తీక్, కళ్యాణ్ చక్రవర్తి, గురుమూర్తి, వీఆర్వో డాక్టర్ తిరుపతి రెడ్డి, వెల్ఫేర్ ఆఫీసర్లు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు అధ్యపకేతర బృందం పాల్గొన్నారు.

# పొన్నమండ లక్ష్మణ స్వామికి ఘన నివాళి అర్పించిన మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ మన జనప్రగతి ఆగస్టు 07:–** అగ్నికుల క్షత్రియుల జాతిపిత స్వర్గీయ పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ గారి జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్లో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ లక్ష్మీషాతో కలిసి పొన్నమండ లక్ష్మణ స్వామి వర్మ గారి చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. అగ్నికుల క్షత్రియుల చరిత్రను భవిష్యత్ తరాలకు చాటిచెప్పిన మహనీయుడు, ఆయుర్వేదంతో వేలాది మంది పేదలకు ఆరోగ్యాన్ని ప్రసాదించిన గొప్పవ్యక్తి జయంతిని అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులిచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కి ప్రత్యేక ధన్యవాదాలు. సమాజంలో ప్రజలు పడుతున్న సమస్యల్ని చూసి.. చలించి పోయి వారికి అండగా నిలిచారు. పేదల కోసం కోరంగిలో ఉచిత వైద్యశాల ఏర్పాటు చేశారు. అగ్నికుల క్షత్రియుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా పత్రికను నడిపించారు. తన కులాన్ని సమాజంలో చిన్నచూపు చూడడాన్ని సహించలేక చరిత్ర మొత్తాన్ని అధ్యయనం చేశారు. బ్రిటీష్ వారి గ్రంథాలను సైతం అధ్యయనం చేసి.. బ్రిటీష్ ప్రభుత్వానికి ఆధారాలతో ఒప్పించి అగ్నికుల క్షత్రియులుగా గుర్తింపు తీసుకొచ్చారు. ప్రత్యేకంగా జీవో నెం.271/1929 తీసుకురావడం లక్ష్మణస్వామి వర్మ గారి చిత్తశుద్ధికి నిదర్శనం. కుల మత వర్గాలకు అతీతంగా అందరి ఆదరాభిమానాలను సొంతం చేసుకున్న పొన్నమండ లక్ష్మణస్వామి వంటి మహనీయుల అడుగుజాడల్లో నడిచే అవకాశం లభించడం తన అదృష్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తతే రక్షణ కవచం..!

### శ్లోక పాఠశాలలో విద్యార్థులకు అగ్నిమాపక శాఖ అవగాహన కార్యక్రమం

### జాగ్రత్తలు పాటించాలని సూచించిన అగ్నిమాపక అధికారి శివరామిరెడ్డి

**వేంపల్లె మన జనప్రగతి ఆగస్టు 07:**–అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు ఎంతో అవసరమని వేంపల్లె అగ్నిమాపక అధికారి బి.శివరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక శ్లోక ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలను అగ్నిమాపక సిబ్బంది డెమో ద్వారా విద్యార్థులకు వివరించారు. ప్రమాద సమయంలో ఆందోళన చెందకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని, అగ్ని ప్రమాద నివారణ పద్ధతులపై ప్రతి ఒక్కరూ అవగాహన



కలిగి ఉండాలని శివరామిరెడ్డి సూచించారు.అగ్ని భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇళ్లలో, పాఠశాలల్లో విద్యుత్ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి.నవనీశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు అగ్నిమాపక సిబ్బంది హరిబాబు, సురేంద్రరెడ్డి, భీమాంజనేయులు, సంజీవరెడ్డి, ఆసిఫ్, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అత్యవసర సమయాల్లో సంప్రదించాల్సిన నంబర్లు:అగ్నిమాపక అత్యవసర సేవలు: 101వేంపల్లె అగ్నిమాపక కేంద్రం: 9441768101అగ్నిమాపక అధికారి: 8977728628

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174